J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 28 16.12.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# ఆ నలుగురినీ జగన్ నమ్మడం లేదా?



- శరవేగంగా సొంత సైన్యం వైపు అడుగులు
- గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మక నిర్ణయాలు
- కన్వీనర్లు.. వారి ద్వారా గృహసారథులు
- ఆ 'నలుగురి'కీ తగ్గుతున్న ప్రాధాన్యత

***అ**నితరసాధ్యమైన ప్రజా మద్దతుతో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర పరిపాలన కోసం మాత్రం ఓ నలుగురిపైనే ఆధారపడ్డారు అనే భావన వైసీపీలో నిలువెల్లా వినబడుతూ ఉంటుంది. తండ్రి రోజుల నాటి నుంచీ ఆ కుటుంబానికి తలలో నాలుకలా వ్యవహరిస్తూ వస్తున్న సమీప బంధువుని కూడా పక్కనపెట్టి, ఆ నలుగురికీ వైఎస్ వారసుడు ప్రాధాన్యత ఇచ్చారు.*

చేతిలో అధికారం, చీమ చిటుక్కుమన్నా కనిపెట్టగలిగే నిఘా విభాగం, జగన్‌ని రెండోసారి అధికారంలో కూర్చోబెట్టడానికి 'ఐ ప్యాక్' నిరంతర కసరత్తు. ఇవన్నీ ఉన్నా ఆయన చుట్టూ ఉన్నది మాత్రం ఆ నలుగురే. జగన్ చెవిలోకి వెళ్ళేది ఆ నలుగురు చెప్పిందే. ఆయన వరకూ వెళ్లగలిగేది కూడా ఆ నలుగురే. అయితే, ఇప్పుడా నలుగురిని కూడా జగన్ నమ్మడంలేదా అన్న అనుమానం రాజకీయ విశ్లేషకులలో వ్యక్తమవుతోంది.

ఆ నలుగురు చేసిందీ, చేస్తున్నదీ ఏమిటి..? క్షేత్రస్థాయిలో జరుగుతున్న తప్పిదాలను దాచిపెడుతున్నారా..?? జనం మనసులో ఉన్న మాటను జగన్ దాకా చేరనీయకుండా ముసుగేసి మాయ చేస్తున్నారా..??? చాలాచోట్ల వ్యక్తమవుతున్న వ్యతిరేకతని అధినేత దృష్టికి తీసుకువెళ్లే ధైర్యం చేయలేకపోతున్నారా...??? అంటే పై ప్రశ్నలన్నిటికీ అవుననే సమాధానమే విశ్లేషకులనుండి వినపడుతోంది.

రాష్ట్రానికి రాజధాని లేదు, ప్రత్యేకహోదా లేదు. హైదరాబాదు తరహా అంతర్జాతీయ నగరం లేదు. ఆశించిన స్థాయిలో పారిశ్రామిక అభివృద్ధి లేదు. ఆర్థిక వనరుల సమీకరణకు అవకాశం లేదు. మౌలిక సదుపాయాల కల్పన లేదు. ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగులకి మధ్య సమన్వయం లేదు. అధికారపార్టీ నేతలలో సమైక్యత లేదు. పార్టీ వర్గాలలో సంతృప్తి లేదు. బలమైన ప్రతిపక్షం లేదు.

ఉన్నదల్లా 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన శక్తివంతమైన ప్రభుత్వం. ఇప్పటికీ చెరగని చరిష్మాతో, విశేష జనాధారణ కలిగిన ముఖ్యమంత్రి. క్షేత్ర స్థాయిలో ప్రజల మనోభావాలను గమనించలేని సలహాదారులు. అహంభావాన్ని అలంకారంగా చేసుకుని ప్రజాక్షేత్రంలో పర్యటిస్తున్న 25మంది మంత్రులు. 'దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకుందాం' అన్న రీతిలో మళ్ళీ తాము గెలుస్తామో లేదో? అసలు తమకు టిక్కెట్టు వస్తుందో రాదో..?? అన్న అనుమానంతో దొరికిన మేరకు దోచుకుంటున్న ఎంఎల్‌ఏలు. పదుల సంఖ్యలో కార్పొరేషన్లు, కార్లపై బోర్డులు పెట్టుకుని దర్పం ప్రదర్శిస్తున్న సదరు కార్పొరేషన్ల ఛైర్మెన్లు. 26 జిల్లాల అధ్యక్షులు, 8 మంది ప్రాంతీయ సమన్వయకర్తలు. అధినేతను కలిసి వాస్తవాలను వివరించగలిగిన సమర్ధత ఉన్నా, అవకాశం దొరకని పార్టీ శ్రేణులు.

10లో





# గుజరాత్‌లో విజయంపై.. బీజేపీ సంబరాలు

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించడంతో నెల్లూరులోని బీజేపీ నాయకులు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బాణసంచా వేడుకలు జరిగాయి. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. గుండ్లపల్లితో పాటు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తదితర నాయకులు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు, దేశానికి చేస్తున్న సేవలను ప్రజలు గుర్తించి బీజేపీకి ఘనవిజయం సాధించిపెట్టారన్నారు. గుజరాత్‌లో బీజేపీ ఏడవసారి అధికారంలోకి రావడం, తిరుగులేని మెజార్టీతో ఇంతకాలంగా అక్కడ విజయం సాధిస్తుండడం బీజేపీ పట్ల, ప్రధాని మోదీ పట్ల ప్రజలకు ఉన్న అభిమానమే కారణమన్నారు. ప్రధాని మోదీ దేశాభ్యున్నతికి చేస్తున్న సేవలతో పాటు, ప్రపంచవ్యాప్తంగా మార్గదర్శకమైన కార్యక్రమాలు చేపడుతుండడం భారత్‌కే గర్వకారణమన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా బీజేపీ విజయం సాధించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ సంబరాల్లో బీజేపీ నాయకులు విజయకుమార్, నరసింహులునాయుడు, ఫణిరాజు, మస్తానయ్య గౌడ్, మొగరాల సురేష్, కరణం భాస్కర్, మండ్ల ఈశ్వరయ్య, అశోక్‌నాయుడు, శ్రీనివాసులుగౌడ్, ప్రవీణ్‌కుమార్, గిరికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

# ప్రీ-క్రిస్మస్ వేడుకలు 20న



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 20న ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. బిషప్ అధ్యక్షత్వంలో, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఇటీవల శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బర్నాబాస్, డేవిడ్ దయాసాగర్, క్రాంతి, చినబాబు, జోసఫ్, జాకబ్, ప్రసాద్, మనోక్ తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డ్స్ డిఎస్పీగా..
# చంద్రమోహన్



విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో సిటీ ఆర్‌ఐగా పనిచేస్తున్న ఎస్.చంద్రమోహన్ నెల్లూరు హోంగార్డ్స్ డిఎస్పీగా నియమితులయ్యారు. నెల్లూరుజిల్లా విడవలూరు ఆయన స్వస్థలం. 1992లో పోలీసు శాఖలో ఆర్‌ఎస్‌ఐగా చేరారు. 2008లో ఆర్‌ఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఆ తర్వాత విశాఖపట్నం రూరల్, ఒంగోలులో ఆర్‌ఐగా విధులు నిర్వహించి, విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో సిటీ ఆర్‌ఐగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయన్ను అక్కడ నుంచి నెల్లూరు హోంగార్డ్స్ డిఎస్పీగా నియమిస్తూ డీజీపీ కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు.

## ప్రిన్సిపాల్స్ సంఘం..
# కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా శాఖకు ఇటీవల కొత్త కార్యవర్గం ఎంపికైంది. నెల్లూరులోని కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆ సంఘం సమావేశంలో కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. గౌరవాధ్యక్షునిగా జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి కె.మధుబాబు, గౌరవ సలహాదారునిగా జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి టి.వరప్రసాద్, అధ్యక్షునిగా కోవూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్‌వి సికిందర్, ఉపాధ్యక్షునిగా మనుబోలు కాలేజీ ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్, కార్యదర్శిగా వెంకటాచలం కాలేజీ ప్రిన్సిపాల్ బి.డి దీనదయాళ్, కోశాధికారిగా పొదలకూరు కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్‌గా కందుకూరు కాలేజీ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ఎంపికయ్యారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## • ధర్నాలో రైతు నాయకులు



మాండూస్ తుఫాన్ ప్రభావంతో వచ్చిన భారీ వర్షాలతో నష్టపోయిన జిల్లా రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, అఖిల పక్ష రైతుసంఘం జిల్లా కన్వీనర్ గంగపట్నం రమణయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎస్‌కె షానవాజ్ కోరారు. వర్షాలకు వేలాది ఎకరాల్లో నారుమళ్లు మునిగిపోయి అనేకప్రాంతాల్లో రైతులు బాధలుపడుతున్నారని, వరే కాక మినుము, శనగ, మిరప తదితర అనేక రకాల పంటలు కూడా దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులకు తగు సాయం అందించాలంటూ వారు ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట ధర్నాందోళన నిర్వహించారు. రైతులకు ఈ కష్టకాలంలో విత్తనాలు, ఎరువులను ఉచితంగా అందించాలని, వర్షాలకు దెబ్బతిన్న చెరువులను, బలహీనంగా ఉన్న చెరువు కట్టలను వెంటనే బాగుచేయించాలని, పారుదల సక్రమంగా లేని కాలువల్లో పూడిక తీయించాలని వారు కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఐ నాయకులు రామరాజు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కండలేరు ముంపువాసులకు.. ఉద్యోగాలివ్వండి

## జిల్లా కలెక్టర్ ఆదేశం

జిల్లాలోని కండలేరు జలాశయం ముంపు బాధితులకు ఉద్యోగాల కల్పనను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 12న తన బంగ్లాలో నిర్వహించిన జిల్లాస్థాయి అధికారుల కమిటీ సమావేశంలో కలెక్టర్ ముంపు బాధితుల సమస్యల విషయాన్ని చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కండలేరు ముంపు బాధితుల ఉద్యోగాలకు సంబంధించిన కార్యాచరణ, పునరావాసం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలని, త్వరగా వారికి ఉద్యోగాలను కల్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జేసీ కూర్మనాథ్, తెలుగుగంగ ప్రాజెక్టు సిఇ హరినారాయణరెడ్డి, డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, కలెక్టరేట్ ఏఓ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## నార్త్ రాజుపాలెంలో..
# అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



కొడవలూరు మండలంలోని నార్త్‌రాజుపాళెం గ్రామంలోని రామాలయం ప్రాంగణంలో ఈనెల12న అభయాంజనేయస్వామి శిలాబింబాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం మహా కుంభాభిషేకం, శ్రీ సీతారాముల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

# భారీ వర్షాలతో.. జిల్లా అతలాకుతలం

- 'మాండూస్' తుఫాన్ ప్రభావం
- అయిదారురోజులుగా ఒకటే వాన

'మాండూస్ తుఫాన్' ప్రభావంతో జిల్లాలో గత అయిదారు రోజులుగా ఒకటే వానలు. తుఫాన్ ముసురు, రాత్రిపూట ఈదురుగాలులు, ఆగి ఆగి కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లా అతలాకుతలమైంది. జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు, శివారులన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీళ్ళు రావడంతో అనేకప్రాంతాల్లో ప్రజలు అవస్థలు పడ్డారు. సముద్రతీర ప్రాంతాలైతే వానాగాలులతో వణికిపోయాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఈదురుగాలుల ధాటికి విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. నెల్లూరు విద్యుత్‌శాఖ పరిధిలో సుమారు 454 విద్యుత్‌స్తంభాలు, 154 ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయినట్లు గుర్తించారు. దీంతో విద్యుత్ అంతరాయాలతో గ్రామీణులు ఇబ్బందులకు గురయ్యారు. అప్పటికప్పుడు కరెంటోళ్ళు ఎట్లనో ప్రయాసపడి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మొత్తంగా జిల్లాలో విద్యుత్‌శాఖకు కనీసం రెండు కోట్ల రూపాయలకు పైగానే నష్టం వచ్చివుంటుందని ప్రాథమిక అంచనా. వానభీభత్సంతో రోడ్లు దెబ్బతిని వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల రోడ్లు కోతకు గురైతే, మరికొన్ని చోట్ల పెద్దపెద్ద గండ్లు పడ్డాయి. రోడ్లు కాలువల్లా మారి, నెల్లూరు నగరం యధాప్రకారం బురదగుంటగా మారింది. ఆదివారం జిల్లాలో అత్యధికంగా ఉలవపాడులో 92.75 మిల్లీమీటర్లు, కందుకూరులో 78 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈనెల 12న సోమవారం కూడా పెద్ద వర్షమే. ఉరుములు మెరుపులతో ఈదురుగాలులతో హడలగొట్టింది. వాననీటి ప్రవాహానికి నెల్లూరు రోడ్లలో నడవడం సామాన్యులకొక



సర్కస్‌గా మారింది. జిల్లాలో సుమారు 250 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయని అంచనా. వాటిని బాగుచేసి మళ్ళీ శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేయాలంటే కనీసం 150 కోట్ల రూపాయలకు పైగానే అవసరమని కూడా అధికారులు అంచనా వేస్తున్నారు.




## రైతన్నలు.. నేతన్నల అవస్థలు

మరోవైపు ఈ భారీవర్షాలతో చెరువులు నిండాయి. జిల్లాలో 1800 చెరువులుంటే అత్యధికం నిండిపోయాయి. వాగులు వంకలు పొంగి పొర్లిపోయాయి. పెన్నానది, బొగ్గేరు-బీరాపేరు వంటి ఏర్లన్నీ సుళ్ళుతిరుగుతూ ప్రవహించాయి. చేలల్లో నీరు నిలచి రైతులు అవస్థలు పడ్డారు. మగ్గాల గుంటల్లోకి నీళ్ళొచ్చి నేతన్నలు బాధలుపడ్డారు. గత శనివారం నుంచి ఆదివారం దాకా జిల్లాలో సగటు వర్షపాతం 75.7 మిల్లీమీటర్లు నమోదైంది. తుఫాన్ తీరం దాటినా వర్షాలు వదల్లేదు. మనుబోలు, ముత్తుకూరు, వెంకటాచలం మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. నెల్లూరులో 56.2, రూరల్‌లో 53.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని సోమశిల, కనిగిరి రిజర్వాయర్లు నిండుకుండలయ్యాయి. రాళ్ళపాడు ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. ప్రవాహం అధికమవుతుండడంతో సోమశిల డ్యామ్ నుంచి పెన్నకు, అక్కడ నుంచి సముద్రానికి కొంత నీళ్ళు వదిలేశారు. ఈ వానల దెబ్బకి జిల్లాలో సుమారు 5వేల హెక్టార్లకు పైగానే నారుమళ్ళు దెబ్బతిని ఉంటాయని అధికారుల అంచనా. పంటనష్టం జరిగిన రైతులను ఆదుకుంటామని, 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేస్తామని జిల్లా కలెక్టర్ భరోసా ఇవ్వడంతో ఆమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# అమరజీవి త్యాగనిరతి..అపారం..అమూల్యం!


## నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు



ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి వెలకట్టలేనిదని, ఆ మహనీయుడు చూపిన సన్మార్గంలో ప్రయనిస్తూ ప్రతి ఒక్కరూ దేశసేవలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. ఈనెల 15వ తేది గురువారం నెల్లూరు కలెక్టరేట్ లోని మహాకవి తిక్కన ప్రాంగణంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరజీవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సముపార్జనలో, రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమన్నారు. ఆ మహనీయుడిని స్మరించుకోవడం, ఆయన ఆశయ సాధనకు కృషి చేయడం మనందరి బాధ్యతగా పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు గారి పేరు మీద మన జిల్లా 'శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా'గా ఏర్పడడం మనందరికీ గర్వకారణమని, ఆయన తెలుగు ప్రజలపై చూపించిన ప్రేమ, అభిమానానికి స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ శాంతి, సత్యం, అహింస వంటి భావాలు కలిగి మంచి నడవడికతో సమాజ హితం కోసం పాటుపడాలని కోరారు. విద్యార్థులందరూ దేశసేవలో తరించిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని ఉత్తమ పౌరులుగా దేశానికి సేవలందించాలన్నారు. తొలుత నగరంలోని ఆత్మకూరు బస్టాండు సమీపంలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ హరిత, డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, డిసిహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, అసిస్టెంట్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తేజోవతి, శ్రీదేవి, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పొట్టి శ్రీరాములుకు 'భారతరత్న' ప్రకటించాలి

## 70వ వర్ధంతి సభలో అంతర్జాతీయ వైశ్య సమాఖ్య విజ్ఞప్తి



ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అసువులు బాసిన శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం అపూర్వమని, ఆ మహనీయునికి కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' ప్రకటించాలని స్వాతంత్ర్య సమరయోధులు, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి చలమయ్య విజ్ఞప్తి చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరులో వైశ్య సమాఖ్య ఆధ్వర్యంలో అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరజీవి జ్ఞాపక చిహ్నంగా రాష్ట్ర రాజధానిలో స్మృతివనంతో పాటు, శాసనసభ, పార్లమెంట్ ఆవరణల్లో చిత్రపటాలు ఏర్పాటు చేయాలని, శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతులు జయంతుల కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమరజీవి చిత్రపటాలను పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా శాసనసభలో శ్రీ పొట్టి శ్రీరాములుకు 'భారతరత్న' ప్రకటించాలన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టి కేంద్రానికి పంపాలని ఆయన సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతులు వర్ధంతుల కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఆదేశాలు ఇవ్వడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆర్‌వి శరత్, ఎస్.నాగేశ్వరరావు, ఎన్.రవీంద్రనాథ్, ఏ.నరసింహులు, ఆర్ శేషగిరి, ఆర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# కాంక్రీట్ తయారీపై..ఎన్‌బికెఆర్‌లో సదస్సు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల కాంక్రీట్ తయారీపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. జెఎస్‌డబ్ల్యు సిమెంట్ వారు పాల్గొని కాంక్రీట్ తయారీలో జిజిబిఎస్ వాడకం ప్రాధాన్యతను వివరించారు. జెఎస్‌డబ్ల్యు సేల్స్‌మేనేజర్‌లు రాఘవహరినారాయణ, శివప్రసాద్‌లు ఈ సదస్సులో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, కాంక్రీట్ తయారీలో మన బైండింగ్ మెటీరియల్‌గా వాడే సిమెంట్ శాతాన్ని తగ్గించి, స్టీలు ఉత్పాదక పరిశ్రమల్లో లభ్యమయ్యే జిజిబిఎస్ అనే వ్యర్థపదార్థాని ఉపయోగిస్తే అది కాంక్రీట్ స్వభావాన్ని మార్చి కట్టడాలు, నిర్మాణాలు దృఢంగా ఉండేట్లు చేయడంతో పాటు వాటి జీవితకాలాన్ని కూడా పెంచుతుందన్నారు. దీంతోపాటు కాంక్రీట్‌కు క్లోరైడ్, సల్ఫేటు వంటి హానికరమైన రసాయనాలను తట్టుకునే గుణాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. నిర్మాణరంగంలో కాంక్రీట్ తయారీలో జిజిబిఎస్ ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సులో కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తపన్ను

# వసూలు చేసేది లేదు

## సచివాలయ జేఏసీ నాయకుల స్పష్టీకరణ

చెత్తపై పన్ను వసూలు చేసేది లేదంటూ సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఆ మేరకు ఈనెల 14న నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో నగర మేయర్ పొట్లూరి స్రవంతికి నోటీసు కూడా ఇచ్చి మరీ చెప్పారు. జేఏసీ నాయకులు డి.సురేష్‌బాబు, టి.మల్లికార్జున్, శీనయ్య తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెత్తపై పన్ను వసూలు చేయాలన్న ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామని, ఈనెల 6న విశాఖలో ఆ ఒత్తిడి తట్టుకోలేక సచివాలయ కార్యదర్శి బాకూరి చంద్రమోహన్ గుండెపోటుకు గురై మృతి చెందారని వారు మేయర్‌కు తెలిపారు. దీంతో జేఏసీ రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయంలో భాగంగా చెత్తపన్ను వసూళ్ళను నిలిపేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.

## సోమిరెడ్డి జమున

# అవార్డుల ప్రదానం.. 25న

జాతీయస్థాయి సోమిరెడ్డి జమున అవార్డ్స్-2022లను డిసెంబరు 25న నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో ప్రదానం చేయనున్నామని, ఈ అవార్డులకోసం నిర్వహించిన పోటీలో ఇద్దరికి అవార్డులు లభించాయని ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద తెలిపారు. 'నానీ'ల విభాగంలో 'అమ్మ' నానీల సంపుటి రచయిత పుచ్చకాయల బ్రహ్మాజీరావు, నవలల విభాగంలో 'హీరో' నవలా రచయిత ప్రభాకర్ జైనీకి అవార్డులను అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా డా. వింధ్యవాసినీదేవి, డా.విఆర్ రాసాని, శిరంశెట్టి కాంతారావు, సింహప్రసాద్‌లు వ్యవహరించారని తెలిపారు.

## సాధికార కమిటీ సిఫార్సులను

# ప్రభుత్వం అమలుచేసిందా?

- పెన్షన్ పథకంపై పార్లమెంట్‌లో బిఎంఆర్ ప్రశ్నలు



2018లో కేంద్రప్రభుత్వం ఉద్యోగుల పెన్షన్ పథకం మూల్యాంకనం, సమీక్ష కోసం సాధికార పర్యవేక్షణ కమిటీని ఏర్పాటుచేసిన విషయం వాస్తవం కాదా?..ఆ కమిటీ చేసిన సిఫార్సులను ప్రభుత్వం అమలుచేసిందా లేదా?..ఆ వివరాలు చెప్పండని ఈనెల 15న పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) ప్రశ్నించారు. ఇపిఎస్ పనితీరుకు సంబంధించి ప్రభుత్వం ఏవైనా ఇతర సంస్కరణలను చేపట్టిందా?..అని కూడా అడిగారు. అందుకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖలమంత్రి రామేశ్వర్ తెలి సమాధానమిస్తూ, ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ 1995 యొక్క పూర్తి మూల్యాంకనం, సమీక్ష కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన హైఎంపవర్డ్ మానిటరింగ్ కమిటీ చేసిన సిఫార్సుల ప్రకారం..ప్రభుత్వం నోటిఫికేషన్ జిఎస్ఆర్ 20.02.2020 నాటి 132 (ఇ) అటువంటి కమ్యుటేషన్ తేదీ నుంచి 15 సంవత్సరాలు పూర్తయిన తర్వాత సాధారణ పెన్షన్ పునరుద్ధరణకి సంబంధించిన సిఫార్సులు అమలుచేసిందని తెలిపారు. ఆమేరకు కమ్యుటేషన్ ప్రయోజనాన్ని పొందిన సభ్యులకు సంబంధించి ఈ పథకం, సెప్టెంబరు 25, 2008న లేదా అంతకు ముందైతే సాధికారత పర్యవేక్షణ కమిటీ సిఫార్సు చేసిన ప్రకారం ఇపిఎస్, 1995 కింద కనీసపెన్షన్‌ను నెలకు వెయ్యి నుండి 2 వేల రూపాయలకు పెంచడానికి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని వివరించారు.

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. వైకాపాదే విజయం

## - కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న ధీమా -



ఎన్నికలు ఎప్పుడొచ్చినా సరే, వైకాపాయే ఘనవిజయం సాధిస్తుందని, అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ధీమాగా చెప్పారు. ఈనెల 14న కోవూరు మండలంలోని పడుగుపాడు గ్రామంలో ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా అర్హులైనవారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని రాష్ట్రప్రభుత్వం అనేకరకాలైన సంక్షేమపథకాలను ఇళ్ళవద్దకే వెళ్ళి అందిస్తోందని, గత మూడేళ్లలో లక్షలాది కోట్ల రూపాయల పథకాలు ప్రజలకు అందజేయడం దేశంలోనే ఒక గొప్ప రికార్డ్ అని అన్నారు. గతంలో ఎవరూ చేయలేనివిధంగా, పేదప్రజలకు అండగా నిలచి ఎన్నో పథకాలు చేపట్టారని, అందువల్లనే ప్రజలందరూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని, వైకాపాను ఆదరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రతిఒక్కరు కోరుకుంటున్నారన్నారు. తొలుత ఆయన కొడవలూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం మండలాలకు చెందిన ముగ్గురు బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 14 లక్షలా 90వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి కవరగిరి శ్రీలత, ఎంపిపి తుమ్మలపెంట పార్వతి, ఎంపిడిఓ శ్రీహరి, తహశీల్దార్ పద్మజ, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఏఎంసి ఛైర్మెన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టళ్ళలో..మెస్‌ఛార్జీలు పెంచండి

## కలెక్టర్‌కు విద్యార్థిసంఘం నాయకుని వినతి

జిల్లాలోని వెనుక బడిన తరగతులకు చెం దిన విద్యార్థులకు కళాశాలల హాస్టల్స్‌లో మెస్‌చార్జీ లను 1400 నుంచి కనీసం 2500 రూపాయలు పెంచాలని, వారికి మెరుగైన వసతులు కల్పిం చాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు లీలాకృష్ణయాదవ్ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 12న జరిగిన 'స్పందన' కార్యక్రమంలో పాల్గొని బీసీ విద్యార్థుల సమస్యలను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా మెస్‌ఛార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు సరైన పౌష్టికాహారం లభించక అనారోగ్యాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరులోని బీసీ బాలుర వసతిగృహాన్ని రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారని, విద్యార్థులకు ఎలాంటి వసతులు లేక అవస్తలు పడుతున్నారని ఆయన అధికారులకు విన్నవించారు.

లాయర్
డిసెంబర్ 16, 2022

# 'క్యాన్సర్' కోరల నుంచి.. విముక్తి ఎప్పుడు?

'క్యాన్సర్'.. ఆ మాట వింటేనే గుండెలు జల్లుమంటాయి. ఎవరికైనా క్యాన్సర్ వచ్చిందని తెలిస్తే..'అయ్యో! పాపం' అనుకుంటాం. అంటే, ఇక ఎంతకాలం బతుకుతారన్నది ప్రశ్నార్థకమే. ఎందుకంటే, మనుషులను పట్టి పీడించే ప్రాణాంతక వ్యాధుల్లో 'క్యాన్సర్' ఒకటి. ఒకసారి ఈ వ్యాధి వస్తే అనారోగ్య బాధలు చుట్టుముట్టినట్టే. ఆ వ్యాధిబాధతో నిరంతరం వేదన పడుతూ పోరాడాల్సిన పరిస్థితి వస్తుంది. ఎంత పోరాడినా చివరికి గెలుస్తామన్న నమ్మకం ఉండదు. ఇంట్లో ఒకరికి క్యాన్సర్ వస్తే, ఆ కుటుంబమంతా ఎంతగా క్షోభపడుతుందో చెప్పలేం. కళ్ళముందే రోగిని ఆ వ్యాధి కబళిస్తుంటే ఏమీ చేయలేని అసహాయస్థితిలో బాధిత కుటుంబాలు విలవిలలాడుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక వైద్యం శరవేగంగా విస్తరిస్తున్నా, ఎన్నెన్నో గొప్పగొప్ప సాంకేతిక పరికరాలు, వ్యాధినివారణకు మందులు వగైరాలన్నీ అందుబాటులోకి వస్తున్నా, మరోవైపు ఈ వ్యాధి విస్తృతంగా వ్యాపిస్తూనే ఉంది. ప్రపంచాన్నంతా ఈ వ్యాధి బాధిస్తూనే ఉంది. మనదేశంలోనూ క్యాన్సర్ మహమ్మారి మృత్యుఘంటలు మోగిస్తూ విలయ తాండవం చేస్తూనే ఉంది. నిత్యం లక్షలాదిమంది ఈ వ్యాధితో జీవన్మరణ పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ భయంకరవ్యాధిని ఇక జయించలేమా అనే బాధ ప్రజల హృదయాలను మెలిపెడుతూనే ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రతిఏటా ఈ కేసులు, మరణాలు పెరుగుతూనే ఉన్నాయి. 2020లో దేశంలో 13.92 లక్షల క్యాన్సర్ కేసులుంటే, 2025 నాటికి ఆ సంఖ్య 15.69 లక్షలకు పెరుగుతుందని కూడా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అంటే, ఈ వ్యాధి పెరగడమే తప్ప తరగడం ఉండదనే సూచనలు ఇందులో కనిపిస్తున్నాయి. ఇదెంతో ఆందోళనకరం. కేంద్రప్రభుత్వం కూడా ఇటీవల క్యాన్సర్ కేసుల వివరాలను వెల్లడించింది. ఆ అధికారిక నివేదిక ప్రకారం తాజాగా మనదేశంలో 14,61,427 కేసులున్నాయంటే దేశంలో క్యాన్సర్ వ్యాధి ఎంతగా విస్తరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ వ్యాధి మరింతగా ప్రబలుతూనే ఉంది. ఏటా వేలాదిమంది ప్రాణాలను బలితీసుకుంటూనే ఉంది. తెలంగాణ-ఆంధ్ర రాష్ట్రాల్లో దాదాపు 73వేలకుపైగానే క్యాన్సర్ కేసులున్నాయంటే క్యాన్సర్ ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది. 2020 నుంచి లెక్కించినా ఆంధ్రలో వరుసగా 2020లో 38,582 మంది, 2021లో 39,443 మంది, 2022లో ఇప్పటిదాకా 40,307 మంది ఈ వ్యాధికి ప్రాణాలు కోల్పోయారని కేంద్ర గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే విధంగా తెలంగాణలో కూడా ఈ ఏడాది ఇప్పటిదాకా 27,339 మంది క్యాన్సర్‌కు బలైపోయారు. ఇంకా ఎంతకాలం ఈ బాధలు?..ఈ వ్యాధులు?..వీటికి అంతే లేదా?..ఈ విషపువ్యాధుల కోరల నుంచి ప్రజలకు విముక్తి ఎప్పుడు?.. అన్నది ఎంతోకాలంగా జవాబులేని ప్రశ్నగానే ఉంటోంది.

శరీరంలో నిరంతరం ప్రతి కణం విభజనకు గురై, పుడుతూ గిడుతుండే పరిణామక్రమంలో కణజాల ప్రక్రియకు విఘాతం ఏర్పడితే కొన్ని కణాలు చనిపోకుండా అలాగే ఉండిపోతుంటాయని, కణాల్లో ఉండే డిఎన్ఏలో మార్పులవల్లే ఈ పరిస్థితి ఏర్పడుతుందని, ఈ మార్పులే సహజంగా క్యాన్సర్‌కు, బ్లడ్‌క్యాన్సర్‌కు దారితీస్తుంటాయని వైద్యనిపుణులు చెప్తుంటారు. అదేవిధంగా ముఖ్యంగా ఆహారపుటలవాట్లు, జీవనశైలి క్రమబద్ధంగా లేకపోవడం, రేడియేషన్ ప్రభావం, పొగతాగడం వంటి దురలవాట్లు, ఊబకాయం తదితర కారణాల వల్ల కూడా డిఎన్ఏలో మార్పులు వస్తాయని, అవి క్రమేణా క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా, ఈ వ్యాధి లక్షణాలను వైనంగా తెలుసుకుని, బాగా అవగాహన చేసుకుని, ప్రాథమిక స్థాయిలోనే చికిత్సలు చేసుకుంటే ఈ వ్యాధినుంచి బయటపడొచ్చని, వ్యాధి ముదిరిపోయాక చాలా అవస్థలు పడాల్సివస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అందుకు తగ్గ అవగాహనను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వ్యాధి నియంత్రణపై ప్రభుత్వాలు మరింతగా దృష్టిపెట్టి, ఆసుపత్రులను, వైద్యులను, చికిత్సలను అన్ని రాష్ట్రాల్లో ప్రజలకు అందుబాటులోకి తేవాలి. కరోనా వంటి మహమ్మారిపై పోరు సాగించిన విధంగానే, దేశంలో కోట్లాదిమంది ప్రాణాలు తీస్తున్న క్యాన్సర్ వ్యాధిని అంతం చేసేందుకు కేంద్రం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు నడుంబిగించాలి. శాస్త్రవేత్తలు, వైద్యయంత్రాంగమంతా కలసి క్యాన్సర్‌ను జయించేందుకు సమాయత్తం కావాలి. ఇలాంటి మహమ్మారి వ్యాధుల బాధలు లేకుండా.. దేశమంతా ఆరోగ్యంతో ఉండేలా సత్వర చర్యలు తీసుకోవాలి. తద్వారా 'ఆరోగ్యభారత్'ను సాకారం చేసుకోవాలి.

# 'నీడ లేని'..నగర బతుకులు



ఒక పక్క పెన్నమ్మ-ఆ అమ్మ ఒడిలో శయనించివున్న శ్రీరంగనాథుడు, మరో పక్క మూలాపేట మూలస్థానేశ్వరుడు, ఇంకోపక్క నెల్లూరుకు ఒకప్పట్లో స్వర్ణాలు పండించిన స్వర్ణాల చెరువు, గట్టుమీద కళకళలాడే చల్లనితల్లి ఇరుకళలమ్మ..చక్కని ప్రశాంత, ఆధ్యాత్మిక వాతావరణానికి నెల్లూరు పెట్టింది పేరు. మంచి గాలికి, నీళ్ళకి కరువుండేది కాదు. ఎర్రటిమట్టి రోడ్లయినా ఎంత బావుండేవో! ప్రజలు కూడా సేవాభావంతో, మానవత్వంతో పదుగురికి మేలుచేసే మంచిగుణంతో ఉండేవారు. ఎక్కడ చూసినా చలివేంద్రలు ఉండేవి. సేద తీరేందుకు నాలుక్కాళ్ళ మండపాల వంటివి ఉండేవి. కొన్ని చోట్ల సత్రాలు, వాటి ముందు అరుగులు ఉండేవి. ఏ కూడలిలోనైనా నిలబడి ఎంతసేపైనా మాట్లాడుకునేందుకు హాయిగా చెట్ల నీడ ఉండేది. రోడ్ల పక్కనంతా ఏళ్ళతరబడిగా పెద్దోళ్ళు నాటిన చెట్లు, పెద్ద మానులై అందరికీ నీడనిచ్చేవి. ఆ చెట్లన్నీ ఉన్నంతకాలం అందరికీ నీడనిచ్చి చివరికి రోడ్ల విస్తరణకు, నగరాభివృద్ధికి ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించి వాటి త్యాగనిరతిని చాటుకున్నాయి. ఇదంతా పాతనెల్లూరు కథ. ఇప్పుడా రోజులెప్పుడో పోయాయి. కాలం మారింది! పెద్ద పెద్ద చెట్లను కొట్టేసి, చిన్న చిన్న మొక్కలు నాటుకొంటున్నామిప్పుడు. పర్యావరణం కాపాడుకోవాలి కదా!..

నెల్లూరు నగరంలో నిత్యం వేలాదిమంది ప్రజలు కాలినడకనే తిరుగుతూ తమ పనులు చూసుకుంటూ ఉంటారు. వాళ్ళల్లో కొంతమందికి కాళ్ళకి చెప్పులు కూడా ఉండవు. ఒక చేతిలో సంచీ, మరోచేతిలో పేదరికం..వాళ్ల సమస్యలు బోలెడు.

## సమస్యలతో 'రణం'

పొద్దున్న లేచిన దగ్గర నుంచీ ప్రతిదానికీ బజారుకు బయలుదేరాల్సిందే. ప్రత్యేకించి పొద్దున్నే లేచి కూరగాయల మార్కెట్లకు వచ్చే వారెంతోమంది కాలినడకనే వస్తుంటారు. వీళ్ళు వేలసంఖ్యలోనే ఉంటారు. వాళ్లు కాక, ఇరుగుపొరుగు పల్లెల నుంచి పరుగు పరుగున వచ్చిపోయే జనానికి లెక్కే ఉండదు. అందులో మహిళలు, వృద్ధులు, అధికం. పసిబిడ్డలకు ఎండ తగలకుండా చీరకొంగు కప్పి జాగ్రత్తగా రోడ్ల పక్కగా నడుస్తుంటారు ఎందరో తల్లులు. రోడ్లకు అటువైపు ఇటువైపు అంతా షాపులే ఉంటాయి. ఎక్కడ చూసినా క్రిక్కిరిసి ఉంటారు జనం. వానకో, ఎండకో తలదాచుకోవడానికి మాత్రం ఉండదు స్థలం!..ఇదన్నమాట..ఇప్పటి నెల్లూరు.

### బాధలు పట్టించుకోండి మహాప్రభో!..

నెల్లూరులో ప్రధానంగా అన్ని రకాల షాపులున్న ట్రంకురోడ్డు, చిన్నబజారు, పెద్దబజారు, స్టోన్‌హౌస్‌పేట, రంగనాయకులపేట, ములుముడిబస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువమంది పాదచారులే ఉంటారు. ఒంటెద్దులబళ్ళు, గుర్రబ్బళ్ళు, రిక్షాలు పోయాయి. సైకిళ్ళు కూడా ఇప్పుడు పెద్దగా తిరగడం లేదు. ఉంటే బైక్..లేదా 'రెండుకాళ్ళ' బండి. నగరంలో ఏ మూలన కాపురమున్నా ట్రంకురోడ్డు ముఖం చూడందే నిద్రరాని కాలక్షేపరాయుళ్ళు బోలెడు. అందరూ నడిచివచ్చేవాళ్ళే. అందరినీ కలిపి అందంగా 'పాదచారులు' అంటారు. ఏ కొద్దిసేపైనా అలసట తీర్చుకుందామంటే కనీసం నీడ కూడా దొరకడం లేదంటే ఎంత బాధాకరం!..మీరు చూడండి, వెంకటేశ్వరపురం దగ్గర నుంచి ట్రంకురోడ్డు మీదుగా, వేదాయపాలెం-అయ్యప్పగుడి సెంటర్ దాకా నెల్లూరు ప్రధాన రోడ్డు పొడుగూతా ఆ మూలనుంచి ఈ మూలదాకా ఎక్కడైనా చెట్లున్నాయా?..అని ఒకసారి పరిశీలించండి. ఎక్కడో ఒకటో అరా తప్ప పెద్దచెట్లేమీ కనిపించవు. రోడ్ల విస్తరణ అవసరం కనుక, ఇటువైపే కాక, పొదలకూరురోడ్డువైపు కూడా పెద్దపెద్ద చెట్లన్నీ కొట్టిపారేశారు. ఆ తర్వాత నీడ సంగతి మరచిపోయారు. దేన్నయినా కూలగొట్టడం సులభం..నిలబెట్టడమే కష్టం! కాలం మారుతున్నా.. అన్ని రకాల వ్యవస్థలు మారిపోతున్నా.. ప్రజల అవస్థలే మారడం లేదు. పాపం పాదచారులేం అడగ్గలరు?.. తలొంచుకుని పోవడమే తప్ప.. ఏనాడైనా రోడ్లపక్కన నీడ కావాలని, నీళ్ళు కావాలని ఎప్పుడైనా అడిగారా?.. ప్రధానమైన కూడళ్లలో కూడా కాస్తంత నీడనిచ్చే షెల్టర్లు లేవు. షెల్టర్ల కోసం కొంతకాలం క్రితం నెల్లూరులో లక్షలు ఖర్చుపెట్టి ఏసీ షెల్టర్లు కట్టారు. ఎందుకటా?.. ప్రారంభం కాక ముందే మూలనబడి ఏ ఉపయోగం లేకుండా దిష్టిబొమ్మలుగా మిగిలాయి. నిలువనీడ లేనివారికి.. ఏసీ షెల్టర్లు అవసరమా?.. కొద్దిపాటి స్థలం, మూడు ఒంటిరాయి గోడలు.. నాలుగు రేకులు, కూర్చునేందుకు ఒక సిమెంట్ బల్ల చాలు. కాస్త నీడనిస్తే అదే పదివేలు. ఇప్పుడు అవీ లేవు-ఇవీ లేవు. అసలేమీ లేవు. అంతేకాదు, నగరంలో ఎక్కడో ఒకటిరెండు చోట్ల తప్ప, టాయ్‌లెట్ల సదుపాయం కూడా లేదు. మరుగుదొడ్లు ఉండవు. చుట్టుపక్కల ఊళ్ల నుంచి, పనుల కోసం దూరాభారం నుంచి వచ్చినవారికి.. స్థానికులకు ఎవరికైతేనేం.. ఒకవేళ 'అర్జంటైతే' ఏం చేయాలి?.. ఆలోచించండి!.. ఇలాంటి సామాన్య సమస్యల్ని అధికారులు, లేదా పాలకులు ఇంకా ఎప్పుడు పట్టించుకుంటారు?.. ప్రభుత్వ స్థలాల్లోనో, లేదా ఎవరికీ ఇబ్బంది లేని ప్రైవేట్ స్థలాలనో సేకరించి, చిన్న చిన్న షెల్టర్లు ఏర్పాటు చేయడం, కూడళ్ల ప్రాంతాల్లో టాయ్‌లెట్లు, మరుగుదొడ్లు కట్టించడం పెద్ద పనా?.. అధికారులు అనుకుంటే ఎంతసేపు?.. ప్రభుత్వాల్ని కదిలించినా నిధులకు కొదవుండదు. స్థానిక నాయకుల్ని, దాతల్ని, ధనికుల్నీ, స్వచ్ఛందసంస్థలవారినీ అందరినీ సమన్వయం చేసి కార్యసాధనకు దిగితే, ఇలాంటి మంచిపనులు చేపట్టేందుకు సహకరించని వారెవరు?..ఇకనైనా అధికారులు, నాయకులు కదిలి..పాదచారులకు నిలువనీడ కల్పిస్తే చాలు.. ఆ పుణ్యం ఎక్కడికీ పోదు!..

- సంచారి

# 'లంచం రాజకీయాలు'

మొన్న నవంబరు 25న వచ్చిన 'లాయర్'లో బోగాది వెంకటరాయుడు గారు 'మనలో మాట'లో.. 'ఇదీ రాజకీయపార్టీలు చేయాల్సిన పని' అనే శీర్షికతో రాసిన మాటలు నాకు బాగా నచ్చినాయి. అవి నాకు ప్రేరణ్నిచ్చాయి కూడా.

వారికి ధన్యవాదాలు.

ఇటీవలి కాలంలో రాజకీయాలు ధనంతో ముడిపడిపోతున్నాయి.

'లంచం రాజకీయాలు'గా మారిపోతున్నాయి.

ఎన్నికల్లో గెలుపుకి డబ్బీడం మొదలెట్టారు..పెదదారి బట్టిన రాజకీయనాయకులు.

ధనాకర్షన్ని లొంగి, దాన్ని దీస్కోని, అలవాటుబడ్డారు.. పేదలు.

ఇప్పుడు వాళ్ళు డబ్బిస్తేనే ఆమోదముద్రేస్తావంటుండారు.

ఆ మూక వీర్ని చెడిస్తే, యిప్పుడా మూక, యీ మూక గలిసి, ప్రజాస్వామ్యం గుద్దలూడబెరక్తుండారు.

ఆమోదముద్ర కోసం డబ్బన్నా, డబ్బు దీస్కోని ఆ ముద్రేసినా- ప్రజాస్వామ్యాన్ని హత్యజెయ్యటమే.

ఇప్పుడు వావిలాల గోపాలకృష్ణయ్యగారో, సాక్షాత్తూ గాంధీగారో బతికుండి, యెన్నికల్లో పోటీజేస్తే-ఘోరపరాజయం ఖాయం.

ఎన్నికల్లో డబ్బెల్లువ మహా రోత-

ప్రజాస్వామ్య మాతకి పెద్ద కడుపుకోత.

రాజకీయ జీవులు బానిసలు-పదవికి.

ఎన్నికల్లో డబ్బు దీస్కోని ఆమోదముద్రేసే పౌరులూ బానిసలే.. లంచాన్కి.

తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, నెల్లూరు.

# బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది




lawyerpatrika@gmail.com
+91 98663 14741

నెల్లూరు పట్టణంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనంలో బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. ముఖ్యంగా మినీ బైపాస్ రోడ్డులోని రామలింగాపురం కూడలిలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో నరకం కనిపిస్తుంది. నిర్మాణానికి ఇరువైపులా ఉన్న గుంతలను తాత్కాలికంగా పూడ్చాలన్న కనీస బాధ్యత కాంట్రాక్టర్లకి, పూడ్పించాలన్న స్పృహ నేతలకి, అధికారులకి లేకపోవడం సిగ్గుచేటు. అధికారులు, ప్రజానేతలు కార్లలో తిరుగుతారు, వాళ్లకి సామాన్యుల బాధలు కనపడవు. రోడ్లపై ప్రజలు పడుతున్న కష్టాలు తెలియవు. ఈ సెంటర్ వద్ద ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ద్విచక్ర వాహనం నడపాల్సివస్తుంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉండి పట్టు తప్పినా... అంతే సంగతులు, ఆసుపత్రిపాలు కావాల్సిందే. ఎక్కడైనా ఇలాంటి నిర్మాణాలు జరిగేటప్పుడు ముందుగా ఆ నిర్మాణానికి అటు ఇటు ఉన్న రోడ్డుని సక్రమంగా ఉండేలా చూస్తారు. ఆమాత్రం కనీస జ్ఞానం కూడా ఇక్కడ ఎవరికీ లేకపోవడం దురదృష్టం. నోట్లు పోసి ఓట్లు కొనుక్కోవడం తప్ప, నాయకులకు ప్రజల ఇబ్బందులపై కొంచెం కూడా శ్రద్ధ లేదనడానికి ఇదే పెద్ద ఉదాహరణ. మామూళ్ల ముసుగులో నేతలు, అధికారులు వర్ధిల్లుతున్నంత కాలం సామాన్య ప్రజలు ఇలాంటి కష్టాలలో మునిగి తేలాల్సిందే...!

ఎం.వి.మురళీకృష్ణ, హరనాథపురం.

# రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్నాం

## - వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రైతుల శ్రేయస్సే ధ్యేయంగా తాము పనిచేస్తున్నామని, మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. ఈనెల 14న పొదలకూరు మండలంలోని విరువూరు గ్రామంలో కనుపూరు కాలువ వద్ద 1.06కోట్ల రూపాయలతో పునర్నిర్మించిన విరువూరు ఛానల్ ట్రఫ్ అక్విడెక్ట్ సూపర్‌ప్యాసేజ్ (దోనె)ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో సంభవించిన భారీవర్షాలు, వరదల్లో కొట్టుకుపోయిన విరువూరు సప్లైఛానల్ దోనెను యుద్ధప్రాతిపదికపై నిర్మించి, అన్నదాతలకు సాగునీరందించడం తనకెంతో ఆత్మసంతృప్తినిచ్చిందన్నారు. ఈ దోనె ఏర్పాటుతో సుమారు 1400 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు సంబంధించి ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, కేవలం కండలేరు లెఫ్ట్ కెనాల్‌లో నీటిని ఎత్తిపోసేందుకు లిఫ్ట్‌ఇరిగేషన్ మోటార్లు మాత్రమే ఏర్పాటుచేశారని ఆయనన్నారు. ఇప్పుడు ఆ మోటార్లను కూడా వినియోగించే అవసరం లేకుండా రాష్ట్రమంతా పుష్కలంగా వర్షాలు కురుస్తూ, రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. మొన్న కురిసిన భారీవర్షాలకు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. అనంతరం మంత్రి తాటిపర్తి పంచాయతీలోని వరదాపురంలో 30 లక్షల నుడా నిధులతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. జలవనరులశాఖ ఎస్ఇ కృష్ణ మోహన్, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్ రాజు, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఆర్డీఓ మాలోల, ఎంపిడిఓ నగేష్‌కుమారి, తహశీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

# బిఎంఆర్‌కు..మరో ముఖ్య బాధ్యత



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) మరో కొత్త బాధ్యత స్వీకరించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నియమించే కమిటీల కూర్పుకు సంబంధించి, వాటి స్వభావాన్ని పరిశీలించే ముఖ్యబాధ్యతను చేపట్టారు. లాభదాయక కార్యాలయాలపై జాయింట్ కమిటీకి తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆయన సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ కమిటీలో 15 మంది సభ్యులుంటారని, లోక్‌సభ నుండి 10 మంది, రాజ్యసభ నుండి అయిదుగురు సభ్యులను ఎన్నుకున్నారని ఆయనో ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 102ను అనుసరించి ఈ కమిటీ బాధ్యతలను నిర్వహిస్తుందన్నారు.

# వేడుకగా..ఎమ్మెల్యే ప్రసన్న పుట్టినరోజు

- అభిమానులు, నాయకుల సంబరాలు



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పుట్టినరోజు పండుగ ఈనెల 12న వేడుకగా జరిగింది. నియోజకవర్గంలోని అనేకప్రాంతాల్లో పెద్దఎత్తున నాయకులు, అభిమానులు, అనుచరులు, ఆయన జన్మదినవేడుకలను అట్టహాసంగా నిర్వహించి, ప్రసన్నపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అనునిత్యం నియోజకవర్గ అభ్యున్నతికి కృషిచేస్తూ, నియోజకవర్గంలోని అన్నిప్రాంతాలు, అన్నిగ్రామాల ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ, అవసరమైనవారికి, బాధితులకు తనవంతు చేయూతనందిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న ఔదార్యాన్ని ఈ సందర్భంగా అందరూ కొనియాడారు. ప్రజలమనిషిగా, జననాయకునిగా అందరి ప్రశంసలందుకుంటున్న ప్రసన్న కోవూరు నియోజకవర్గానికి శాశ్వత ఎమ్మెల్యేగా ఉండాలని కోరుకుంటూ అభిమానులు, ప్రజలు ప్రసన్నకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రసన్న బర్త్‌డే వేడుకల్లో బుచ్చి నగరపంచాయతీ సర్పంచ్ మోర్ల సుప్రజ పాల్గొని మాట్లాడుతూ, బుచ్చి నగరపంచాయతీకి ఒక్క ఏడాదిలోనే దాదాపు వందకోట్ల రూపాయల నిధులను మంజూరుచేయించిన ఘనత ఎమ్మెల్యే ప్రసన్నదని, ఆయన ప్రజల సమస్యల సాధనకోసం నిరంతరం కృషిచేసే నాయకుడని కొనియాడారు. అనంతరం 60 కేజీల కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. ఆ తర్వాత, ప్రసన్న పుట్టినరోజున చేసే సేవాకార్యక్రమాల్లో భాగంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. నగరపంచాయతి వైస్ ఛైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్‌ఛైర్మెన్ షేక్ షాహుల్, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్ రెడ్డి, మేనకూరు సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, వవ్వేరు బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలోనూ ప్రసన్న పుట్టినరోజు వేడుకలు జరిగాయి.

**ప్రసన్నకు నాయకుల శుభాకాంక్షలు :**

తన పుట్టినరోజు సందర్భంగా నల్లపరెడ్డి ప్రసన్న ఈనెల 12న హైదరాబాద్‌లో కేకు కట్‌చేసి నాయకులకు పంచిపెట్టారు. డిఏబి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు తదితరులు నేరుగా ప్రసన్నను కలుసుకుని, 61వ జన్మదినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా కోవూరులోని సాయిబాబా మందిరంలో ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

# ఉత్సాహంగా వీఎస్‌యు యువజనోత్సవం

- ఓవరాల్ ఛాంపియన్లుగా నిలిచిన వీఎస్‌యు, కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాలలు
- బహుమతులు ప్రధానం చేసిన వీసీ సుందరవల్లి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీలో రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన వర్శిటీ అంతర కళాశాలల యువజనోత్సవం (యూనివర్శిటీ ఇంటర్ కాలేజీ యూత్ ఫెస్టివల్) యూనివర్శిటీ కళాశాల సెమినార్ హాల్లో విద్యార్థినీవిద్యార్థుల కోలాహలం నడుమ ఈనెల 13న ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి యూనివర్శిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య జి.ఎం.సుందరవల్లితో పాటు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ముఖ్యఅథితులుగా పాల్గొని వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. వర్శిటీ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన 120 మంది విద్యార్థినీ విద్యార్థులు వివిధ అంశాల్లో పోటీలు పడ్డారు. యూత్ ఫెస్టివల్ ఓవరాల్ ఛాంపియన్లుగా రోలింగ్ ట్రోఫీని ఉమ్మడిగా వి.ఎస్.యూ కళాశాల నెల్లూరు, కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల అందుకున్నాయి. ఈ సందర్భంగా వైస్-ఛాన్సలర్ ఆచార్య జి.ఎం.సుందరవల్లి మాట్లాడుతూ యువజనోత్సవంలో వివిధ పోటీలలో నెగ్గిన విద్యార్థినీవిద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిచ్చి త్వరలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్ పోటీలకు పంపుతామన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, యువత నిరంతర కృషి ద్వారా తమ లక్ష్యాలను సాధించాలన్నారు. యువజన ఉత్సవం విద్యార్థులకు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని, విద్యార్థులు తమలోని ప్రతిభని బేరీజు వేసుకునే సాధనంలా ఉపయోగపడుతుందన్నారు. వర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయానందకుమార్‌బాబు, కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కృష్ణారెడ్డి ప్రసంగించారు. అనంతరం విజేతలకు బహుమతులందజేశారు.

# ఘంటసాల గానం.. తెలుగుజాతికే గర్వకారణం

- అమరగాయకుని శతజయంతి సభలో వక్తల ప్రశంస

అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గానం తెలుగుజాతికే గర్వకారణమని వక్తలు కొనియాడారు. ఘంటసాల గానం అద్భుతమని, ఆయన పాడిన పాటలను ఎన్నేళ్ళు గడిచినా ఎవరూ మరచిపోలేరని ప్రశంసించారు. ఈనెల 11న నెల్లూరు టౌన్‌హాలులో ఘంటసాల అభిమాని నీలకంఠం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘంటసాల శతజయంతి వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఘంటసాల కుమార్తె శ్యామలమ్మ పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో ఆయన తన తండ్రిని స్మరించుకుంటూ, ఈ శతజయంతి వేడుకల్లో తాను పాల్గొనడం తమ కుటుంబానికి దక్కిన గౌరవమన్నారు. ప్రతి ఇంటా భగవద్గీత శ్లోకం నేర్చుకోవాలని, సాహిత్య జిజ్ఞాసను కలిగించుకోవాలని, అన్నిటికన్నా ముఖ్యంగా భక్తిభావాన్ని పెంపొందించాలనే ఆకాంక్షతో పద్మశ్రీ ఘంటసాల చేసిన కృషి అమోఘమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ స్రవంతి అన్నారు. ప్రజల హృదయాల్లో ఘంటసాల గానం.. స్థానం శాశ్వతమని ఘంటసాల వీరాభిమాని, ఈ కార్యక్రమ నిర్వాహకుడు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సినీగాయకునిగా, మహాగాయకునిగా ఘంటసాల గానం ఏనాటికీ మరువలేనిదని, వేలాది పాటలు పాడి లక్షలాదిమంది అభిమానులను ఆయన సంపాదించుకున్నారని, ఘంటసాల మధురగానం తెలుగుజాతికే దేశవ్యాప్త కీర్తిని తెచ్చిందని ఆయన అన్నారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, ఘంటసాల కుమార్తె శ్యామలమ్మను, సరయు అధినేత రాజ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జేఎస్‌రెడ్డి, మోపూరు భాస్కర్‌నాయుడు, పిన్ను గంగాధర్‌రెడ్డి, ఆదిశేషు, చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 'ఘంటసాల సంగీత విభావరి'లో ప్రముఖ గాయనీ గాయకులు రమణయ్య, ఆనందరావు, రామచంద్రరావు, పెంచలరెడ్డి, తులసి, లక్ష్మి తదితరులు ఘంటసాల గీతాలను అద్భుతంగా ఆలపించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. ఈ సందర్భంగా నీలకంఠం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మేయర్ స్రవంతి ప్రారంభించి రక్తదానం విశిష్టతను వివరిస్తూ, రక్తదాతలను అభినందించారు.




ఘంటసాల కుమార్తె శ్యామలమ్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

# నెల్లూరు కబుర్లు

## సైన్స్‌ఫెయిర్‌లు.. సృజనాత్మకంగా ఉండాలి

- డిఇఓ సుబ్బారావు



విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, సైన్స్‌ఫెయిర్‌లు సృజనాత్మకతతో ఉండేలా చూడాలని ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు అన్నారు. ఈనెల 13న నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న జడ్పీహైస్కూల్‌లో మండలస్థాయి సైన్స్‌ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో సైన్స్‌ఫెయిర్‌లను నిర్వహిస్తున్నామని, విద్యార్థుల మేధోశక్తికి ఇవి పదునుపెడతాయని ఆయన చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధరకాల నమూనాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, సమగ్ర శిక్ష అధికారి ఉషారాణి, సైన్స్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామికి..వైభవంగా పుష్పాభిషేకం



నెల్లూరు నగరం వేదాయపాలెంలో కొలువైవున్న అయ్యప్పస్వామి దేవస్థానంలో ఈనెల 11న కార్తీక మాస మండల పూజల సందర్భంగా స్వామివారికి మండలపూజలు ఘనంగా నిర్వహించారు. కేరళకు చెందిన ఆలయ తంత్రి హరి నంబూద్రి, మేల్ శాంతిరామన్ తిరుమేని, రామచంద్ర భట్టు, సత్యనారాయణల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హోమం, పుష్పాలంకరణ, ఉషఃపూజ, శీవేలి ఉత్సవం, నవకాభిషేకం, పుష్పాభిషేకం కనువిందుగా జరిగాయి. శ్రీ స్వామివారి ప్రాకార శీవేలి ఉత్సవం, సాయంత్రం మహాదీపారాధన, భగవతి సేవ, అత్తాళ పూజ, పడి కర్పూరం, హరివరాసనం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ పూజలకు ఉభయకర్తలుగా కోడూరు రవీంద్రరెడ్డి-ప్రసన్నలక్ష్మి దంపతులు, జనీత్‌కుమార్-చంద్రకిరణ దంపతులు, తనుజారెడ్డి, జ్యోనితలు వ్యవహరించారు.ఆలయ ఛైర్మన్ జి.శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కేజీ శంకర్, బట్టేపాటి నరేందర్ రెడ్డి, కత్తి మోహనరావు, బొగ్గల మురళీమోహన్‌రెడ్డి, ముంగమూరు కృష్ణచైతన్యరెడ్డి, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## 18న యోగా పోటీలు

డిసెంబరు 18న జిల్లాస్థాయిలో యోగా పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాప్రాధికారసంస్థ అధికారి, సెట్నెల్ సిఇఓ డి.పుల్లయ్య తెలిపారు. నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో 8-12-14-17-21 సంవత్సరాల వయసు కలిగిన క్రీడాకారులకు ఆయా విభాగాల్లో పోటీలుంటాయని, ఈనెల 17వ తేదీలోగా ఆధార్, వయసు ధృవీకరణ పత్రంతో, పేర్లు నమోదుచేసుకోవాలని, ఆసక్తికలిగిన వారు యోగా ఇన్‌స్ట్రక్టర్ ప్రసన్న నం.8885668752ను సంప్రదించాలని కోరారు.









## జిల్లాకు మరో తుఫాన్ హెచ్చరిక

- అందరూ అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్



ఈనెల 20-23 తేదీల మధ్యలో జిల్లాకు మరో తుఫాన్ హెచ్చరిక ఉందని, అందువల్ల ఎక్కడా ఎటువంటి నష్టాలు జరగకుండా అధికారులు ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మనుబోలు మండల పరిధిలోని గురివిందపూడి, కాగితాలపూరు గ్రామ సచివాలయాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు అవసరమైన మందులను అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులను, పాడి పశువుల యజమానులను అప్రమత్తం చేయాలన్నారు. ముందుజాగ్రత్తగా అన్ని చర్యలను సకాలంలో చేపట్టి తుఫాన్ ముప్పును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రాజు, పంచాయతీరాజ్ ఎస్ఇ అశోక్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహశీల్దారు సుధీర్ తదితరులున్నారు.

## చేవూరుకు..కొత్త పదవి



**రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్‌గా నియామకం**

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ.. రాష్ట్ర అధ్యక్షులుగా చేవూరు దేవకుమార్‌రెడ్డి నియమితులయ్యారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఇటీవల పిసిసి నూతన అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏఐసిసి సెక్రటరీలు సీడీ.మయప్పన్, క్రిస్టోఫర్ తిలక్, కొప్పోలు రాజు, జేడీ శీలం, రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, పల్లం రాజు, కనుమూరి బాపిరాజుల ఆధ్వర్యంలో ఏపీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు.. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఉంటూ కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందిస్తున్న చేవూరు దేవకుమార్‌రెడ్డిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆస్తులకు మరియు రాష్ట్ర ఆస్తుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్‌గా అధికారికంగా నియమిస్తున్నామన్నారు. అనంతరం ఆయన చేవూరుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు జంగా గౌతమ్, షేక్. మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ, రాకేష్‌రెడ్డి, నర్రెడ్డి తులసీరెడ్డి, జెట్టి.గురునాధం, కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## బంగారంగళ్లలో తనిఖీలు



నెల్లూరులోని బంగారు దుకాణాలపై తూనికలు కొలతల అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈనెల 12,13 తేదీల్లో తనిఖీలు చేపట్టి, బిల్లులు సక్రమంగా చూపని దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ రెండురోజుల్లోనే మొత్తం 45 కేసులు నమోదు చేయడంతో, అంగళ్లవారు ఎక్కడికక్కడ దుకాణాలు మూసేసి వెళ్ళిపోయారు. ఈ తనిఖీల్లో ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్, అసిస్టెంట్ కంట్రోలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగులకు జీతాలివ్వలేని ప్రభుత్వం

- జనసేన మనుక్రాంత్ విమర్శ



రాష్ట్రప్రభుత్వం ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయిందని, చివరికి ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితి ఏర్పడిందని, ఇంతటి దారుణమైన స్థితి రాష్ట్రానికి ఎప్పుడూ లేదని జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి అన్నారు. ఈనెల 13న నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలివద్ద జనసైనికులతో కలసి ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం ఉద్యోగులను చులకనగా చూస్తోందని, 15వ తేదీ దాటుతున్నా జీతాలివ్వకుంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో జనసేన తప్పకుండా గెలుస్తుందని, పవన్‌కల్యాణ్ సిఎం అవుతారని, అప్పుడు ఈ బాధలన్నీ తీరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బద్దిపూడి సుధీర్, కారంపూడి కృష్ణారెడ్డి, కలువాయి సుధీర్, షేక్ అలియా, గుడి హరిరెడ్డి, వరకుమార్, శ్రీగౌరి, కృష్ణవేణి, మణికంఠరెడ్డి, వినయ్‌కుమార్, సుల్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ 'ఆట్యా పాట్యా' పోటీలకు..సై!

➤ మునిసిపల్ స్కూల్ విద్యార్థులు రెడీ!



నెల్లూరు వెంగళరావునగర్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగే క్రీడాపోటీలకు సై అంటున్నారు. ఈ పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఆట్యా పాట్యా పోటీల్లో ప్రతిభాపాటవాలు చూపుతూ, జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు ఇక్కడ చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు కె.వర్షిత, ఏ.జానకి, ఎస్‌కె రసూల్, 7వ తరగతి విద్యార్థిని పి.సుమశ్రీలు పంజాబ్‌లోని చండీఘర్‌లో జరుగనున్న 29వ జాతీయ సబ్‌జూనియర్ పోటీలకు మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనుండడం సంతోషకరమని ఆ పాఠశాల హెడ్ మాస్టర్ ఎం.గోపాలరాజు తెలిపారు. అక్కడ కూడా తమ విద్యార్థులు రాణించి మంచి బహుమతులు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షిస్తూ, ఆ విద్యార్థులందరినీ దీవించారు. వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేతపై జీఎస్టీని రద్దుచేయాలి

చేనేతపై ప్రభుత్వం విధించిన జీఎస్టీని పూర్తిగా రద్దుచేయాలని ఏపి చేనేత కార్మికసంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈనెల 13న నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేతకారునికి, అనుబంధ వృత్తులవారికి కూడా వర్తింపజేయాలని, పట్టు, నూలు ధరలను తగ్గించాలని, ఆప్కో బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. చేనేతకారుల సమస్యలు తీర్చి, చేనేత అభివృద్ధికి ప్రభుత్వాలు చొరవచూపాలన్నారు.


## 'గీతామయి'లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ




నెల్లూరులోని శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 11న జరిగిన 'మానవహక్కుల దినోత్సవం'లో సినీదర్శకుడు మహేష్‌చంద్ పాల్గొన్నారు. అనంతరం, బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు, ఆశ్రమం అధినేత తమ్మినేని పాండు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు, గౌరవాధ్యక్షులు వై.చంద్రశేఖర్‌రెడ్డి, కె.భవ్యశ్రీ పాల్గొన్నారు.

### భూసార క్షీణత తగ్గించేందుకు
# ఏం చర్యలు తీసుకున్నారు?

## పార్లమెంట్‌లో అడిగిన ఎంపీ ఆదాల



భూసార క్షీణతను తగ్గించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఈనెల 13న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ రాత పూర్వకంగా సమాధానం ఇస్తూ, భూసార క్షీణతను తగ్గించేందుకుగాను జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని తెలిపారు. భూమి క్షీణత, వాతావరణ మార్పుల ప్రభావంపై ప్రభుత్వం అనేక అధ్యయనాలను చేపట్టిందని, ఆ బాధ్యతను భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) తీసుకుందని పేర్కొన్నారు. నిక్రా అనే ప్రాజెక్టును ప్రారంభించామని, దీనికి అనేక కేంద్ర పథకాలు సహకరిస్తాయని తెలిపారు.

### రైతులు సర్వం కోల్పోతున్నా..
# ఈ ప్రభుత్వానికి పట్టదా?



**- మాజీమంత్రి సోమిరెడ్డి ఆవేదన**

'భారీవర్షాలకు నష్టపోయిన రైతుల బాధలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని, రైతులు సర్వం కోల్పోతున్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని' మాజీమంత్రి, టీడీపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 13న ఆయన కొండెపి, కందుకూరు నియోజకవర్గాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి, దివి శివరాం, ఇంటూరి నాగేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, దామచర్ల సత్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాండూస్ తుఫాన్ ప్రభావంతో, భారీవర్షాల కారణంగా గోదావరి జిల్లాల నుంచి తిరుపతి వరకు రైతులు కష్టాల పాలయ్యారని, రూ. 600 కోట్ల నుంచి 700 కోట్ల పెట్టుబడితో పాటు, ఎకరాకు రూ. 1.30 లక్షల వరకు రాబడిని కూడా కోల్పోయారని అన్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 1.35 లక్షల ఎకరాల్లో పొగాకు సాగవుతోందని, రైతులు ఒక్కో ఎకరాకు రూ. 50 వేలు పెట్టుబడి పెట్టారని, పొగాకు సాగైవుంటే సుమారు 1800 కోట్ల దాకా దిగుబడి వచ్చేదని తెలిపారు. ఈ భారీవర్షాల దెబ్బకు మొత్తంగా రూ. 1500 కోట్ల వరకు పొగాకు రైతులు నష్టపోయారని, వారిని ఆదుకునే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పొగాకు బోర్డు, బ్యాంకర్లు స్పందించాలన్నారు. పొగాకుకు జీఎస్టీ వసూలు ద్వారా ఆదాయం పొందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ. 20వేలు చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకిచ్చిన రుణాలను రీషెడ్యూల్ చేసి మళ్లీ మరో 5 లక్షల రూపాయల వంతున రుణం ఇవ్వాలని కోరారు. పొగాకు బోర్డు ఒక్కొబ్యారెన్‌కు వడ్డీ లేకుండా 50 వేల రూపాయల వంతున రుణం ఇచ్చి, పంట వచ్చిన తర్వాత రైతుల నుంచి రికవరీ చేసుకోవాలని సూచించారు. మినుము, మిర్చి, శనగ రైతులు కూడా ఈ వర్షాలతో పంటలు కోల్పోయి భారీగా దెబ్బతిన్నారని, వారిని వెంటనే ఆదుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్రప్రభుత్వం ఇంకా వెనుకబడే ఉందని, తెలంగాణతో పోలిస్తే ఇక్కడ సగం ధాన్యాన్ని కూడా కొనలేదని చెప్పారు. ధాన్యం అమ్మిన డబ్బులు కూడా సక్రమంగా సకాలానికి ఇవ్వడం లేదని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం రైతుల సంక్షేమంపై దృష్టిపెట్టి, ఈ కష్టకాలంలో వారిని ఆదుకోవాలన్నారు.

# 18న డిఎస్ఆర్ ట్రస్ట్ మెగా ఉచిత వైద్యశిబిరం

అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ (డిఎస్ఆర్ ట్రస్టు) ఆధ్వర్యంలో ఈనెల 18వ తేది ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కిమ్స్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ప్రముఖ వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ వైద్యశిబిరంలో ప్రముఖ గుండెవైద్య నిపుణులు డాక్టర్ సిఎస్ శ్రీనివాసరాజు, షుగరువ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీహర్ష జక్కు, కాన్పులు-గర్భకోశవ్యాధి నిపుణురాలు డాక్టర్ టిజి లక్ష్మీదుర్గ, ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు డాక్టర్ సి. శశిభరత్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని, షుగర్ టెస్ట్ చేయించు కోవాలనుకునేవారు ఏమీ తినకుండా రావాలని వారు సూచించారు. డిఎస్ఆర్ ట్రస్ట్‌లో ఆరోగ్యకేంద్రం అందుబాటులో ఉందన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# టీబీ వ్యాధిగ్రస్తులకు ఎలాంటి చికిత్సలు చేస్తున్నారు?

## - పార్లమెంట్‌లో ప్రశ్నించిన వేమిరెడ్డి



దేశంలో 75 గిరిజన జిల్లాలను ఆరోగ్య మంత్రిత్వ శాఖ టి.బి అవగాహన కార్యక్రమాల కోసం గుర్తించిందనే విషయం వాస్తవమేనా? 3లక్షల కంటే ఎక్కువమంది క్షయ వ్యాధితో ప్రమాదం బారిన ఉన్నారనే విషయం వాస్తవమేనా?.. వారికి ఎలాంటి చికిత్సలు చేస్తున్నారని ఈనెల 13న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. జిల్లాల వారీగా ఆ వివరాలు తెలపాలని కోరారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి డా. భారతి ప్రవీణ్‌పవార్ సమాధానమిస్తూ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో గుర్తించిన గిరిజన జిల్లాల్లో ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, గిరిజన టి.బి ఇనిషియేటివ్ "NI-KSHAY-2.0" కోసం జాయింట్ యాక్షన్ ప్లాన్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని, దీని ద్వారా ఆరోగ్యం, సంరక్షణ కేంద్రాలతో కూడిన వికేంద్రీకృత టి.బి సర్వీస్ డెలివరీ కమ్యూనిటీ ఔట్రీచ్ మరియు ఇంటింటికీ ప్రచారం, రోగనిర్ధారణ మరియు చికిత్సా కేంద్రాలను బలోపేతం చేయడం జరుగుతుందని, వ్యాధి బారినపడే అవకాశం ఎక్కువగా ఉన్న వారి కోసం టి.బి నివారణ చికిత్స వంటివి చేపట్టామని తెలిపారు. పై కార్యక్రమం ద్వారా చేపట్టిన అవగాహన కార్యక్రమంలో 3,82,251 మంది టీబీ ఉన్నట్లు గుర్తించడం జరిగింది. వీరిలో 10,249 మందికి టీబీ ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించారని, 9,849 మంది రోగులకు (96%) చికిత్స జరుగుతోందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో జిల్లాల వారీగా గుర్తించబడిన టి.బి కేసుల వివరాలు పేర్కొంటూ, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాల్లో 148, తూర్పు గోదావరి జిల్లాలో 50, పశ్చిమ గోదావరి జిల్లాలో 66 కేసులున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 154, ఖమ్మం జిల్లాలో 16, మహబూబాబాద్ జిల్లాలో 174, ములుగు జిల్లాలో 22 కేసులున్నాయని వివరించారు.


# ఆక్వా సమస్యలపై.. కేంద్రమంత్రులతో చర్చించిన బిఎంఆర్

రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఆక్వా సమస్యలపై ఈనెల 13న ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలసి చర్చించారు. ముఖ్యంగా హేచరీలకు సంబంధించి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే బిల్లులోని అంశాలపై ఈ చర్చ జరిగింది. పలువురు హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులతో కలసి బిఎంఆర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల మంత్రి పురుషోత్తం రూపాలను వారు కలుసుకుని ఆ సమస్యలపై మాట్లాడారు. ఆక్వా రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక రకాలైన సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారాన్ని కోరుతూ



వినతిపత్రం సమర్పించారు. ఈ చర్చల్లో బిఎంఆర్‌తో పాటు అఖిలభారత హేచరీ అసోసియేషన్ సెక్రటరీ జోషీబీ, తమిళనాడు ప్రెసిడెంట్ కాల్‌రాజ్‌బీ, సెక్రెటరీ ఎలంచేరల్ పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 34వ భాగం




ద్రోణాచార్యుడు, ద్రుపదుని అవమానం భరించలేక, కోపం వచ్చినా ఆపుకుని అక్కడినుంచి వెళ్లిపోతూ ఎలాగైనా ద్రుపదుని మీద ప్రతీకారం తీర్చుకోవాలని నిశ్చయించుకుంటాడు. తిరిగి తన ఆశ్రమానికి వెళ్లి ఇక అక్కడ ఉండలేక భార్య, కొడుకుని తీసుకుని హస్తినాపురం వచ్చి కృపాచార్యుని వద్ద అతిథిగా నివసిస్తూ ఉంటాడు.

ఒకరోజు కౌరవ, పాండు కుమారులు తోటలో బంతి ఆట ఆడుకుంటున్నప్పుడు, ఆ బంగారు బంతి వెళ్లి చాల లోతైన నూతిలో పడుతుంది. పిల్లలకి ఏమి చెయ్యాలో అర్థం కాక సతమతమవుతుంటే, అదే సమయంలో ద్రోణాచార్యుడు విల్లంబులతో తిరుగుతుంటే, ఈ పిల్లల సందడి చూసి అక్కడికి వచ్చి విషయం గ్రహించి ఆ బంతిని తీస్తానని, ఒక బాణం ఆ బంతికి గుచ్చుకునేటట్లు వేసి, అలా ఇంకో బాణం దానికి గుచ్చుకునేటట్లు వేసి, అలా బాణాలు వేసి ఆ బంతిని తీస్తాడు. పిల్లలు ఎంతో ఆనందపడి, ద్రోణాచార్యుని భీష్ముని దగ్గరకు తీసుకువెళ్లి, ఆయన బంతిని ఎలా తీశారో చెప్పుతారు. భీష్ముడు, ఎంతో సంతోషించి ద్రోణాచార్యుని గురించి తెలుసుకొని, ఆయన్నెంతో గౌరవించి, ధన సహాయం చేసి, కౌరవ, పాండు కుమారులకు ధనుర్విద్యాభ్యాసం నేర్పమని కోరి, ఆయనికి తన ఆస్థానంలో సముచిత స్థానం కల్పించాడు. ద్రోణాచార్యుడు రాకుమారులందరిని పిలిచి, ధనుర్విద్యాభ్యాసం అయిపోగానే, తన కోరిక తీర్చమని అడిగినప్పుడు, అర్జునుడు ఒక్కడే లేచి నిలబడి, ఏ కోరిక అయినా తాను తీరుస్తానని అన్నప్పుడు, ద్రోణుడెంతో సంతోషించి అక్కడి నుంచి అర్జునుణ్ణి తన ప్రియ శిష్యుడి లాగా చూసుకుంటాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




# సైనికుల సంక్షేమం కోసం..విరాళాలివ్వండి

దేశ సరిహద్దుల్లో పనిచేస్తూ, మాతృభూమి రక్షణకు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన సైనికుల త్యాగనిరతిని స్మరించుకుంటూ ప్రతి ఏటా డిసెంబర్ 7న త్రివిధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకోవడం అందరికీ తెలిసిందే. జాతీయస్థాయిలో ఎంతో ఘనంగా ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా, ఇటీవల నెల్లూరులో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సాయుధ దళాల పతాక దినోత్సవం వాల్‌పోస్టర్లను విడుదల చేసి, సైనిక కుటుంబాల సంక్షేమం ధ్యేయంగా సాగే సాయుధ దళాల పతాకదినోత్సవానికి ప్రజలందరూ విరివిగా విరాళాలివ్వాలని పిలుపునిచ్చారు. సైనిక సంక్షేమాధికారి రమేష్‌తో పాటు, ఎన్‌సిసి అధికారి గుండాల నరేంద్రబాబు, బాలబ్రహ్మాచారి, మోహన్‌రెడ్డి, ప్రసాద్, సివి నాగరాజు, డి.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర సైనికుల కుటుంబాలకు అండగా ఉండేందుకు ప్రజలందరూ తమవంతు బాధ్యతగా విరివిగా విరాళాలిచ్చి సహకరించాలని, 2023 మార్చి 15వతేది వరకు విరాళాల సేకరణ జరుగుతుందని జిల్లా సైనిక సంక్షేమాధికారి పిఎస్ రమేష్ ఈ సందర్భంగా తెలిపారు. విరాళాలు పంపదలచినవారు తమను సంప్రదించవచ్చని, ఆ విరాళాలకు సెక్షన్–80జి కింద ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# పోలీసు ఉద్యోగార్థులకు..ఉచితంగా శిక్షణ

పోలీస్ ఉద్యోగార్థులకు ఉచితంగా శిక్షణ అందించనున్నామని, భోజనం–వసతి సదుపాయాలతో ఈ శిక్షణ ఉంటుందని రామ్‌కీ ఫౌండేషన్ సేవాసంస్థ అధ్యక్షులు ఎంవి రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుశాఖలో ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల పోస్టులకు సిద్ధమవుతున్న రాష్ట్ర యువతకు అర్హత పరీక్ష నిర్వహిస్తామని, మెరిట్ సాధించిన 300 మంది యువతీయువకులకు గుంటూరుజిల్లా పెదపరిమిలోని రామ్‌కీ ఫౌండేషన్ నైపుణ్యశిక్షణ కేంద్రంలో శిక్షణ ఉంటుందని, మరో 500 మందికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. నెల్లూరులోని కరెంటాఫీస్ సెంటర్ వద్దనున్న శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఈనెల 18వ తేది ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ పరీక్ష ఉంటుందని, ఆసక్తి కలిగినవారు ఈనెల 16వ తేదిలోపు తమ పేర్లు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 90007 97789కు లేదా 93905 02357 నంబరుకు సంప్రదించాలని కోరారు.

# ‘భగవద్గీత’లో గోల్డ్‌మెడల్

## • చిన్నారి ‘సువిధ’ ప్రతిభ



నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న చిన్నారి మూల సువిధరెడ్డి ‘భగవద్గీత’ కంఠస్త పోటీల్లో అత్యద్భుత ప్రతిభను కనపరుస్తూ పలు పతకాలు, బహుమతులు సాధించి అందరి ప్రశంసలందుకుంటోంది. భగవద్గీతపై ఎంతో భక్తిశ్రద్ధలతో ఆ బృహత్తర గ్రంథంలోని 700 శ్లోకాలను మైసూరులోని దత్తపీఠం ఆశ్రమం వారి ద్వారా నేర్చుకుని, ఎంతో క్లిష్టమైన ఆ సంస్కృత శ్లోకాలను కూడా స్పష్టంగా పలుకుతూ, అనేక పోటీల్లో మేటిగా రాణిస్తోంది. జాతీయస్థాయిలో మైసూరులో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో సువిధ బంగారుపతకం సాధించి, దత్తపీఠాధిపతి పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా ఆ బహుమతిని అందుకోవడం విశేషం. అదేవిధంగా దత్తపీఠం నుంచి శ్రీ విజయానందస్వామీజీ నెల్లూరులోని శ్రీకృష్ణయోగ మందిరానికి వచ్చినప్పుడు ఆ చిన్నారి భగవద్గీతను సంపూర్ణంగా పారాయణం చేసి స్వామీజీ ఆశీస్సులందుకుంది. ఇటీవల నెల్లూరులోని టిటిడి కల్యాణమండపంలో ‘గీతాజయంతి’ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత కంఠస్త పోటీల్లో కూడా సువిధ ప్రథమస్థానం సాధించింది. అంతేకాదు, తాను చదువుకుంటున్న నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో జిల్లాస్థాయిలో జరిగిన స్పెల్‌బీ పోటీల్లో (సబ్‌జూనియర్స్ విభాగం) కూడా సువిధదే ప్రథమస్థానం. ఆ బాలిక తల్లితండ్రులు సునీల్ కుమార్‌రెడ్డి–శ్రీవల్లి, విశ్రాంత ఉపాధ్యాయులైన తాత నాగిరెడ్డి (ఆదిత్య డిగ్రీకాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)ల ప్రోత్సాహంతో అటు చదువులోనూ, ఇటు భగవద్గీత శ్లోకపఠనంలోనూ ప్రతిభతో బహుమతులు సాధిస్తూ, చిన్నవయసులోనే అందరి మన్ననలందుకుంటున్న సువిధను పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, భగవద్గీతాభిమానులు అభినందిస్తున్నారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- మంత్రి రోజా




విద్యార్థులు కష్టపడి చదివి, తమ మేధోశక్తిని పెంపొందించుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని, సమాజంలో దేనికీ భయపడకుండా కెరీర్‌ని వృద్ధి చేసుకోవాలని రాష్ట్ర పర్యాటక, యువజన శాఖామాత్యులు ఆర్.కె.రోజా అన్నారు. గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ముగింపు కార్యక్రమాన్ని నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కళాశాల ఛైర్మెన్ వంకి పెంచలయ్య, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి కార్యదర్శి అపర్ణ తదితరులతో కలసి ఈ నెల 11న నిర్వహించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ ఆప్‌కాస్ట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఢిల్లేశ్వరరావు, ఉపవిద్యాశాఖాధికారి శివప్రకాష్, మురళి, కళాశాల ఏవో రామయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పోటుపాలెం జాతీయ రహదారి వద్ద మంత్రి రోజాకు ఎమ్మెల్యే వరప్రసాదరావు, వైకాపా నాయకులు బత్తిని విజయకుమార్, కోడూరు మీరారెడ్డి, బొమ్మి శ్రీనివాసులు, నాశిన నాగులు, నరసయ్య, మురళి, అజీజ్, గోవర్ధన్, జగదీష్, మహిళలు, కార్యకర్తలు పాల్గొని స్వాగతం పలికారు.

# లబ్ధిదారులు గృహప్రవేశాలు చేయాలి



కమిషనర్ సాయినాథ్

గూడూరు గాంధీనగర్ సమీపంలోని టిడ్కో అపార్ట్‌మెంట్‌లలో నివాసాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే గృహప్రవేశాలు చేసుకోవాలని, అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని గూడూరు పురపాలక సంఘ కమిషనర్ సాయినాథ్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఈ నెల 13న జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ సమీపంలో టిడ్కో అపార్ట్‌మెంట్లు నిర్మాణం పూర్తి చేసుకుని 3,770 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడం జరిగిందని, అయితే ఇప్పటివరకు ఏడువందల మంది మాత్రమే తమ గృహాల తాళాలను తీసుకు వెళ్లారని, వారిలో కొంతమంది మాత్రమే నివాసం ఉంటున్నారని తెలిపారు. అపార్ట్‌మెంట్ల వద్ద అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని, గృహాలు మంజూరు అయిన లబ్ధిదారులు త్వరితగతిన గృహప్రవేశాలు చేసుకోవాలని సూచించారు.



# తిప్పగుంటపాలెంలో మెడికల్ క్యాంప్

## • ఆర్డీవో కిరణ్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ

తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం తిప్పగుంటపాలెం గ్రామంపై గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ప్రత్యేకశ్రద్ధ చూపారు. తిప్పగుంటపాలెం గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుపోవడంతో అక్కడ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. దీంతోపాటు అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు తానే స్వయంగా గ్రామానికి వెళ్లి ప్రజల ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఓ పెళ్లికి హాజరైన బంధుమిత్రులు గ్రామంలోనే ఉండిపోయారు. ఉప్పుటేరు పొంగడంతో వారు ఇవతల వైపుకు రాలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న ఆర్డీవో కిరణ్‌కుమార్ ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందసభ్యులతో కలిసి గ్రామానికి చేరుకున్నారు. పెళ్లికి హాజరై ఇవతల వైపుకురాలేని బంధుమిత్రులను బోట్ల సాయంతో ఇవతల వైపుకు తరలించారు. అనంతరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వ్యాధుల ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు మండల అధికారులు కూడా ఉన్నారు.

# రెండురోజుల పాటు షటిల్ పోటీలు



గూడూరు పట్టణంలోని ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీలలో షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ గౌరవాధ్యక్షులు చేవూరు విజయమోహన్‌రెడ్డి తెలిపారు. కరోనా కారణంగా రెండేళ్లుగా నిర్వహించని క్రీడలు మళ్ళీ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అబ్దుల్ కలాం, కోదండపాణి, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మైథిలి ఆసుపత్రి 20వ వార్షికోత్సవం



గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని గూడూరు పట్టణంలోని మైథిలి ఆసుపత్రి వైద్యురాలు గుర్రం మైథిలి పిలుపునిచ్చారు. మైథిలి హాస్పిటల్ 20వ వార్షికోత్సవం సందర్భంగా మైథిలి హాస్పిటల్‌లో ఈ నెల 11వ తేదీ మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందని, వర్షాకాల నేపథ్యంలో ప్రజలు రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఎం.డి ఎల్.రమణబాబు, రాజా, హరిప్రియ, శ్రీకాంత్, బాలు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాల కోసం ఏపిటిఎఫ్ ఆందోళన




నవంబర్ నెలకు సంబంధించి ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన జీతాలు, పెన్షన్లు తక్షణమే చెల్లించాలని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 13వ తేదీ దాటినా జీతాలు, పెన్షన్లు చెల్లించని కారణంగా, ప్రభుత్వ వైఖరికి నిసనగా ఏపిటిఎఫ్ తిరుపతి జిల్లా గూడూరు డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.మోహన్‌దాస్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు సిహెచ్ శివరామిరెడ్డి మాట్లాడుతూ ఇంతటి ఘోరమైన పరిస్థితిని ఉద్యోగులు, పెన్షనర్లు రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఎదుర్కోలేదని, ప్రజాసంక్షేమం మాకు ముఖ్యం అంటున్న ప్రభుత్వానికి ఉద్యోగులు, పెన్షనర్లు ప్రజల్లో భాగం కారా? వారికి నిత్యావసరాలు ఉండవా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులు,పెన్షనర్ల పట్ల కక్షపూరిత ధోరణి మానుకోకుంటే పోరాటాన్ని రాష్ట్ర స్థాయిలో తీవ్రతరం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్, జిల్లా కార్యదర్శి కృష్ణప్రసాద్, టి.నారాయణ, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# హక్కులను పరిరక్షించుకోవాలి

## అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవంలో వక్తలు

## ఉత్తమ సేవలకు..పలువురికి విశిష్ట పురస్కారాలు




మానవహక్కులను పరిరక్షించుకోవాలని, చట్టాలు–హక్కుల పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, సమాజంలో హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుచేసుకుని ఉత్తమ సమాజాభివృద్ధికి అందరూ పాటువడాలని వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈనెల 10న నెల్లూరు టౌన్‌హాలులో ప్రపంచ మానవ హక్కుల సంఘం వారిచే ఆ సంఘం జాతీయ చైర్మన్ ఎం. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లాలో ఉత్తమ సామాజిక సేవలందిస్తున్న పలువురికి ప్రపంచ మానవ హక్కుల సంఘం జాతీయ ఛైర్మెన్ మోరంరెడ్డి సుబ్బారెడ్డి చేతులమీదుగా ఉత్తమ సేవా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మానవహక్కుల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. అందరికీ స్వేచ్ఛ, వాక్‌స్వాతంత్య్రం, సమాజంలో జీవించే హక్కు ఉన్నాయని, హక్కులపై అవగాహన కలిగించుకుని అందరూ బాధ్యతగా మెలగాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు.

అనంతరం సామాజిక, మానవీయ సేవలతో సమాజాభివృద్ధికి తోడ్పడుతున్న పలువురు ఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులకు 'సమాజ సేవా పురస్కార్' లతో పాటు ఘనంగా సన్మానాలు చేసి అభినందించారు. మానహక్కుల సంస్థ ఏపీ వర్కింగ్ ఛైర్మెన్ చిలకా ప్రవీణ్‌కుమార్, ఎన్‌సిసి నేవీ ట్రైనింగ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, వర పరివార్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సంకారపు మాధవి, బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు కొప్పోలు రఘు, పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకులు కోగిలి రమేష్, నవ యువ సంకల్పసేవా ఫౌండేషన్ అధ్యక్షులు నితిన్ శివకుమార్ మద్దినేని తదితరులు ఈ జాతీయ పురస్కారాలందుకున్నారు. భారత కేంద్ర వ్యవహారాల మంత్రిత్వశాఖ ఢిల్లీ సిఇఒ శ్రీనివాసరెడ్డి, నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి, మానవహక్కుల సంఘం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రీజనల్ ఛైర్మెన్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ నగర్ సమస్యలు తీర్చండి సార్!

## జనసేన నాయకుల వినతి



నెల్లూరు నగరంలోని వైఎస్సార్ నగర్‌లో ఉన్న ప్రజలు అనేక సమస్యలతో నిత్యం సతమతమవుతున్నారని, అధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఈనెల 12న సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో జేసీ కూర్మానాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలు ఎక్కువగా నివసించే 30వ డివిజన్‌లో ఉన్న వైఎస్సార్ నగర్‌లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కనీసం మంచినీటి సదుపాయం కూడా ఇక్కడ లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పుడు మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతమంతా జలమయమైపోయిందని, ఇళ్ళలోకి నీళ్ళు చేరడంతో ప్రజలు నానా బాధలుపడుతున్నారని పేర్కొన్నారు. జనసేన పట్టణ కమిటీ కార్యదర్శి కృష్ణవేణి, నాయకులు కరీం, ప్రశాంతగౌడ్, హేమచంద్ర, అమీన్, ఇంతియాజ్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

## చాముండేశ్వరిదేవి ఆలయానికి..

# 11లక్షల రాబడి

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో కొలువైవున్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 12న హుండీలు లెక్కించారు. భక్తుల కానుకల ద్వారా ఆలయానికి 11,08,030 రూపాయలు ఆదాయం వచ్చిందని ఇఓ బండి శాంతయ్య తెలిపారు. ఐదున్నర నెలలకు ఈ లెక్కింపు నిర్వహించామని, ఇందులో 40,120 రూపాయలను భక్తులు ఆలయంలో అన్నప్రసాద వితరణకు అందజేశారని పేర్కొన్నారు.



# వెయిట్ లిఫ్టింగ్‌లో సాకిబ్ సత్తా

- అంతర్జాతీయ పోటీల్లో 4 స్వర్ణ పతకాలు
- అభినందించిన నెల్లూరు ఎంపీ ఆదాల

నెల్లూరుకు చెందిన షేక్ సాకిబ్ బాషా 'వెయిట్ లిఫ్టింగ్'లో అత్యంత ప్రతిభతో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని నాలుగు బంగారు పతకాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల తన నివాసంలో కలిసిన సాకిబ్‌కు ఆయన శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 4 వరకు జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సాకిబ్ నాలుగు బంగారు పతకాలను సాధించడం తమకెంతో సంతోషం కలిగించిందన్నారు. స్కాట్ 330 కిలోల విభాగం, బెంచ్ ప్రెస్ 247 కిలోల విభాగం, డెడ్ లిఫ్ట్ 310 కిలోల విభాగం, ఓవరాల్ 887 కిలోల విభాగాల్లో జరిగిన పోటీల్లో తన సత్తా చాటుతూ బంగారుపతకాలు సాధించడం అద్భుతమని ప్రశంసించారు. ఇప్పటిదాకా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 70కి పైగానే పతకాలను సాధించి నెల్లూరు పేరును దశదిశలా మార్మోగించాడని ఆయన వివరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాకిబ్‌కు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సరైన ఆర్థిక సహకారం లభించక ఇబ్బందులు పడుతున్నాడని అంటూ, ఆ క్రీడాకారునికి రైల్వేలో ఉద్యోగానికి సిఫారసు చేస్తానని, ఎల్లవేళలా అండగా ఉంటానని ఆదాల భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, నరసింహారావు, సయ్యద్ ఫయాజ్ ఉద్దీన్, సోహైల్, ఇమ్రాన్, నజీబ్, ఇంతియాజ్, నవీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్మింగ్‌లో..3 స్వర్ణాలు

## -- జిల్లాకోర్టు ఉద్యోగి అద్భుత ప్రతిభ --



నెల్లూరులోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నెల్లిపూడి శ్రీనివాసులు జాతీయస్థాయిలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభతో తన సత్తా చాటుకున్నారు. ఇటీవల మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో నిర్వహించబడిన ఎస్.బి.కే.ఎఫ్ 7వ జాతీయ క్రీడలు–2022 స్విమ్మింగ్ పోటీల్లో ఆయన పాల్గొని ఏకంగా మూడు స్వర్ణ పతకాలు సాధించడం ఎంతో విశేషం. గత నవంబరులో కూడా ఆయన అంతర్జాతీయ స్థాయిలో నేపాల్‌లో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో కూడా పాల్గొని రెండు స్వర్ణ పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారి కె.వి.వి. ప్రసాద్, న్యాయమూర్తులు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవాణి. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.పి.సాయిరాం, న్యాయశాఖ సహోద్యోగులు తదితరులు నెల్లిపూడి శ్రీనివాసులును అభినందించారు.

## విడవలూరులో..

# పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం

విడవలూరు పంచాయితీ పరిధిలో పనిచేస్తున్న 12 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఈనెల 12న రెండు జతల యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ భవానమ్మ, పంచాయతి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టూకీగా...



## వెంగారెడ్డిపాళెంలో..

## వ్యవసాయాధికారుల పర్యటన

సంగం మండలంలోని వెంగారెడ్డిపాళెంలో ఇటీవల వ్యవసాయాధికారులు పర్యటించి పంటపొలాలను పరిశీలించారు. రైతులకు ఎరువుల వాడకం, తెగుళ్ళ నివారణ, సమగ్ర సస్యరక్షణ వంటి విషయాలపై అవగాహన కలిగించారు. వ్యవసాయశాఖ అధికారి మారుతీదేవి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. సురేఖాదేవి, ఎంపిఈఓ శ్రీహరి, సర్పంచ్ అన్నం ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## వలేటివారిపాళెంలో..జీపీడీపీపై శిక్షణ

ప్రజోపయోగకరమైన పనులకు ప్రణాళికలు రూపొందించే జీపీడీపీ కార్యక్రమంలో భాగంగా ఇటీవల కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెంలో ఎంపీపీ పి.మౌనిక స్థానికసంస్థల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. 2023–24 సంవత్సరానికి గ్రామాల అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు అమలుచేయాలో చెప్పారు. ఏపిఓ బాషా, పిఆర్‌ఏఇ గోపీచంద్‌రెడ్డి పాల్గొన్నారు.

## మనుబోలులో..

## నీట మునిగిన పంటల పరిశీలన

మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు నష్టపోయిన జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్‌రాజు చెప్పారు. ఈనెల10న ఆయన మనుబోలు మండలంలోని అక్కంపేట, గురివింద పూడి గ్రామాల్లో మునిగిపోయిన వరిపంటను పరిశీలించారు. నష్టాలను వెంటనే అంచనావేసి పంపాలని అధికారులను ఆదేశించారు.

## 'మాలకొండ' దేవాలయానికి.. 6 లక్షల రాబడి

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలం మాలకొండలో వెలసివున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి ప్రతి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారని, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా గత శనివారం 6,07,044రూపాయల రాబడి వచ్చిందని ఆలయ అధికారి కెబి శ్రీనివాసరావు తెలిపారు.

## మూలపడవలో..

## తుఫాన్ బాధితులకు సర్పంచ్ సేవ

మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ఇబ్బందులు పడుతున్న వాకాడు మండలంలోని తీరప్రాంత గ్రామం పొన్నమానితిప్ప, పంట్రంగం గ్రామాల్లోని 60 కుటుంబాలకు చెందిన పేదలకు మూలపడవ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఈనెల 12న కూరగాయలు పంపిణీ చేశారు. చలికి తట్టుకునేందుకు వృద్ధులకు దుప్పట్లు, మంకీక్యాప్‌లు అందజేశారు.

## కావలి గీతామందిరంలో మహాసంప్రోక్షణ

కావలి రైల్వేరోడ్డులోని గీతామందిరం జీర్ణోద్ధరణను పురస్కరించుకుని ఈనెల 12న వేదపండితుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున మహాసంప్రోక్షణ నిర్వహించారు. తొలుత కంకణధారణం, పుణ్యాహవచనం, వాస్తు హోమం, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. గీతామందిరం కమిటీ ప్రతినిధులు, దాతలు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 80 శాతం రాయితీతో..రైతులకు వరి విత్తనాలు

భారీవర్షాలకు నారుమళ్ళు దెబ్బతిన్న రైతులకు ఎన్ఎల్ఆర్ 33449, ఆర్ఎన్ఆర్ 15048 రకం వరి విత్తనాలను 80శాతం రాయితీతో ఇస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోవూరు మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి చెప్పారు. ఈనెల12న ఆమె మండలంలోని పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.


## ముసునూరులో.. ఇద్దరు దివ్యాంగులకు చేయూత

కావలి సమీపంలోని ముసునూరు వినాయక కాలనీలో ఉన్న ఇద్దరు పుట్టు దివ్యాంగులకు ఇటీవల ప్రకాశం జిల్లా పొదిలి నివాసులు సాయి అనిల్‌కుమార్, బిందు, కనకదుర్గాంబ, హనుమంతరావులు రెండునెలలకు సరిపడా బియ్యం, రూ.1200 నగదు, సరుకులిచ్చి చేయూతనిచ్చారు. కావలి 'సంయుక్త' సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు పేరం రాఘవరెడ్డి - రమాదేవిల కుమారుడు **సాయి కిరణ్‌రెడ్డి - రష్మితరెడ్డి** ల కల్యాణం డిసెంబర్ 7వ తేదీ నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



కనుపర్తిపాడు శేఖరయ్య తమ్ముడు వెందోటి రామచంద్రారెడ్డి - ఇందిరమ్మల కుమారుడు **స్వరూప్ - యామిని**ల పెళ్లి డిసెంబర్ 9వ తేదీ నెల్లూరులో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.



రహదారులు, భవనాల శాఖ ఉద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, అనంతరం అపార్ట్‌మెంట్స్ నిర్మాణం ద్వారా వ్యాపార రంగంలో అడుగుపెట్టి నెల్లూరు నగరవాసులకు 'ధీరజ్' బ్రాండ్‌ను పరిచయం చేసిన మద్దులూరు సంజీవరాజు - సునీతల కుమార్తె **రోహిత - రాజీవ్** (ప్రకాశం జిల్లా దర్శి శాసనసభ్యుడు మద్దిశెట్టి వేణుగోపాల్ - పద్మల కుమారుడు)ల వివాహం డిసెంబర్ 4న రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగింది. రోహిత - రాజీవ్‌ల రిసెప్షన్ డిసెంబర్ 13న నెల్లూరులో జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు వాస్తవ్యులు రాజేశ్వరరెడ్డి - లేట్ సులోచనల కుమార్తె **హిమజరెడ్డి - లక్ష్మీనారాయణరెడ్డి**ల పరిణయం డిసెంబర్ 4వ తేదీ అన్నమయ్యజిల్లా రైల్వేకోడూరులో జరిగింది. నవ వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

# ఆ నలుగురినీ జగన్ నమ్మడం లేదా?

(మొదటి పేజీ తరువాయి)

పై వాళ్ళల్లో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి, ఆయనను, ఆయన కుటుంబాన్ని, పార్టీని అభిమానించే కొద్దిమందికి తప్ప మళ్ళీ అధికారంలోకి రావాలన్న ఆశ, ఆకాంక్ష, ఆశయం ఎవరికైనా ఉన్నాయా...? అంటే లేదనే సమాధానం వస్తుంది. ఆ దిశగా ఒక్క ముఖ్యమంత్రి ఆయనతో పాటు ఏ కొద్దిమందో నాయకులు తప్ప ఇంకెవరూ తపించడం లేదన్నది కూడా విశ్లేషకుల అభిప్రాయం.

## సొంత సైన్యంపై అధినేత దృష్టి...!

జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఈ విషయాలను గ్రహించారని, తాను నమ్ముకున్న ఆ నలుగురూ తనను... తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమను నమ్ముకున్నవారి ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారు తప్ప... పార్టీ పటిష్టత కోసం పాటుపడడం లేదన్న వాస్తవాన్ని ఆయన పసికట్టారన్నది కూడా తాడేపల్లి వాసుల సమాచారం. స్వప్రయోజనాల కోసం స్వార్ధపూరితంగా వ్యవహరిస్తున్నారన్నది కూడా ఆయన గమనించారని, అందుకే ఎవరిపైనా ఆధారపడకుండా తనదైన తరహాలో పావులు కదుపుతున్నారని విశ్లేషకుల భావన. అందులో భాగంగానే ఇప్పుడు తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. 175కి 175 రావాలని లక్ష్యంగా నిర్ణయించి సొంత సైన్యాన్ని బరిలో దింపే ఆలోచనకు శ్రీకారం చుట్టారని సమాచారం. అదే ఆలోచనని గత వారం తాడేపల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన బయటపెట్టారన్నది విశ్లేషకుల అభిప్రాయం.

ఇప్పటికే సచివాలయాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా వాలంటీర్లకు అధికారాలు కట్టబెట్టి, వాళ్ళను శక్తివంతులను చేశారు. ఇప్పుడు వాళ్ళ ద్వారా ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు చొప్పున 45 వేలమంది కన్వీనర్లను, ఆ కన్వీనర్ల ద్వారా 5లక్షలా 20వేల మంది గృహసారధులను నియమించాలని నిర్ణయించారు. ఆ కన్వీనర్లలో ప్రతి ముగ్గురిలో ఖచ్చితంగా ఒక మహిళ ఉండాలని నిబంధన విధించారు. ఆ దిశగా పార్టీ శ్రేణులకు ఆదేశాలు కూడా ఇచ్చి, డిసెంబర్ 20వ తేదీలోగా కన్వీనర్ల నియామకం పూర్తికావాలని గడువుపెట్టారు. 15 వేల గ్రామాల్లో 50 ఇళ్లకు ఇద్దరు లెక్కన ఈ 5 లక్షలా 20 వేల మంది గృహ సారధుల నియామకం జరగాలన్నది జగన్ ఆలోచన. వారంతా పార్టీకి ప్రజలకి మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరించాలన్నది ముఖ్యమంత్రి వ్యూహం. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా నియమింపబడే 45వేల కన్వీనర్ల నేతృత్వంలో 5లక్షల 20వేల మంది గృహ సారధులు పనిచేస్తారు. వీళ్ళు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి క్షుణ్ణంగా వివరిస్తారు. అంతేకాదు, బటన్ నొక్కడం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి ఎంత మొత్తాన్ని అందించారో కూడా గుర్తు చేస్తారు.

## జగనే జనం... జనమే జగన్!

'జగనంటే జనం – జనం అంటే జగన్' ఇదే నినాదంతో ఆయన గత ఎన్నికలలో విజయం సాధించారు. ఈ మూడున్నరేళ్లుగా బటన్ నొక్కి, జనం ఖాతాలలో డబ్బులు వేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజాక్షేత్రంలో పర్యటనలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎప్పుడో సమీక్షలప్పుడో, సమావేశాలప్పుడో తప్ప, కనీసం పార్టీ ఎంపీలకు, ఎంఎల్ఏలకు కూడా సమయం ఇవ్వలేదు. ఇప్పుడు ఎన్నికలు గడువు ప్రకారం జరిగితే మరో 15 నెలలలో జరుగుతాయి, లేదంటే 2023 డిసెంబరులో జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు.

ఈ తరుణంలో బలహీనంగా ఉన్న ప్రతిపక్షం స్పీడు పెంచింది. తనకి ఇవే చివరి ఎన్నికలు అంటూ చంద్రబాబు సింపతీ ప్రసంగాలు చేస్తున్నారు. మరోవైపు జనసేన కూడా 'వారాహి'పై వార్ కోసం బయలుదేరడానికి సిద్ధమయ్యింది. బీజేపీ ఉభయ మధ్యస్థంగా అన్ని పరిణామాలను, మార్పులను విశ్లేషించుకుంటూ, ఆచి తూచి అడుగేస్తూ రాజకీయ చతురతను పాటిస్తోంది.

"మా నాయకుడు జగన్ నేరుగా బరిలోకి దిగారు. ఆ నలుగురిని నమ్ముకుంటే మునిగిపోతాం అని అర్థం చేసుకున్నారు. అందుకే ఇప్పటినుండే పార్టీశ్రేణుల్ని ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు" అని ఒక వైసీపీ అగ్ర నాయకుడే తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. "జగన్ ఆదేశాల్ని పాటించడానికే ఆ నలుగురు తప్ప, ఆ నలుగురి వల్ల నాలుగు ఓట్లు కూడా రావు" అని ఆ నేత సెటైర్ కూడా వేశాడు. ఈ వాస్తవాన్ని అధినేత ఇప్పటికైనా తెలుసుకున్నాడని విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. మొత్తంమీద ఒక్కసారిగా వేగం పెంచి జగనే స్వయంగా బరిలోదిగి వ్యూహరచన చేయడం ఆ నలుగురిపైన నమ్మకం పోవడమే అని తేటతెల్లమైపోయిందన్నది మేధావులు కూడా అంగీకరిస్తున్న విషయం. వైసీపీకి మళ్ళీ మంచి రోజులు మొదలవుతాయన్నది వారి అభిప్రాయం..!



# 'అమరజీవి బలిదానం' పుస్తకావిష్కరణ

ఆంధ్రరాష్ట్ర సాధనకు అసువులు బాసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జీవితచరిత్రను, ఆయన పోరాటగాథను, ప్రముఖ రచయిత డా.నాగసూరి వేణుగోపాల్ 'అమరజీవి బలిదానం' పేరుతో అమూల్య చారిత్రిక అంశాల సమాహారంగా పొందుపరచి పుస్తకంగా రూపొందించారు. ఈ పుస్తకాన్ని ఈనెల 15వ తేది గురువారం మధ్యాహ్నం నెల్లూరు డికెడబ్ల్యు కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా.గిరి, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ డా.మాడభూషి సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత్త డా.టేకుమళ్ళ వెంకటసుబ్బయ్య పుస్తకాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని, అసమాన దీక్షాదక్షతలను కొనియాడారు. అమరజీవి త్యాగనిరతి విస్మరించలేనిదని అన్నారు. అనంతరం డా. నాగసూరిని వక్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కెవి చలమయ్య, నెరసం (నెల్లూరుజిల్లా రచయితల సంఘం) అధ్యక్షులు ఏ.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణతో పాటు పలువురు కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి త్రోబాల్‌కు..కొత్తూరు విద్యార్థి



త్రోబాల్ క్రీడలో ఇందుకూరుపేట మండలం కొత్తూరు జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థి ఎన్.నరేంద్ర ప్రతిభతో రాణిస్తున్నాడంటూ ఆ విద్యార్థిని ఆ పాఠశాల హెడ్మాస్టర్ వి.మల్లికార్జునరావు అభినందించారు. ఈనెల 17 నుంచి వైఎస్సార్ జిల్లాలో జరిగే యూజిఎఫ్ అండర్–17 రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు కూడా నరేంద్ర ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు అరోరా తమ విద్యార్థి రాష్ట్రస్థాయిలో కూడా విజయాలు సాధించాలంటూ అభినందనలు తెలిపారు.

'లాయర్' ప్రియపాఠకులకు అందిస్తున్న 100వ 'మనలోమాట' ఇది..!

# మోడీ(బీజేపీ) గెలిచారా!? ఓడారా!!?

ఈ ఏడాది (2022) చివర్లో మూడు ప్రధానమైన ఎన్నికలు జరిగాయి. ఢిల్లీ ఒక రాష్ట్రంగా ఉంది. దానికి ఒకే రకమైన భౌగోళిక సరిహద్దులు కలిగిన రెండు ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థలు ఉన్నాయి. ఒకటి శాసన సభ. మరొకటి ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్. రెండింటి పరిధి దాదాపు సమానమే.

శాసన సభకు అయితే 70 స్థానాలు ఉన్నాయి. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌కు అయితే 250 కార్పొరేటర్ స్థానాలు ఉన్నాయి.

ఢిల్లీ రాష్ట్రం, మునిసిపల్ కార్పొరేషన్ పరిధితో పాటు ఓటర్ల సంఖ్య కంటే ఎక్కువే. ఈ రెండూ కూడా బీజేపీ గుత్తాధిపత్యంలోనివే.

అయితే, ఒక మామూలు ఐ.ఆర్.ఎస్ అధికారి అయిన అరవింద్ కేజ్రీవాల్... ఆమ్ ఆద్మీ పార్టీ పెట్టిన తరువాత... ఢిల్లీలో మొదటిసారిగా బీజేపీ జైత్రయాత్రకు బ్రేకులు పడ్డాయి.

బీజేపీ అంటే... హంగు, ఆర్భాటాలు. బీజేపీ అంటే.. హై ప్రొఫైల్ నరేంద్ర మోడీ. బీజేపీ అంటే... అపర చాణక్యుడుగా పేరుపొందిన ఎన్నికల స్పెషలిస్ట్ అమిత్‌షా. బీజేపీ అంటే... హిందూ ధార్మిక సంస్థల సైన్య సమూహం. బీజేపీ అంటే... మోడీని పొగడడానికి ఒక దానితో ఒకటి పోటీపడే ఉత్తరాది న్యూస్ ఛానళ్ళు. బీజేపీ అంటే... ఇంద్రధనుస్సులను మరిపించే మోడీ సమ్మోహనో పన్యాస మాయ తెరలు. బీజేపీ అంటే... పైకి కనిపించకుండానే అల్లుకుపోయే ఆర్ఎస్ఎస్ సైన్యం.

ఇక, ఢిల్లీ అంటే... 130కోట్ల జనాభా గలిగిన ఈ సువిశాల దేశ రాజధాని. ఢిల్లీ అంటే – మోడీ, అమిత్ షాల ఇలాకా. వారి నివాస నగరం. ఢిల్లీ అంటే.. ప్రపంచ నేతలు ఎవరో ఒకరు రోజూ వచ్చి పోయే అంతర్జాతీయ మహానగరం. ఢిల్లీ అంటే... మోడీ హయాం ప్రారంభం కావడానికి ఆరేడేళ్ల ముందు నుంచే బీజేపీ ఏలుబడిలో ఉన్న నగరం.

అటువంటి ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌లో... 15ఏళ్లగా చెలాయిస్తూ వచ్చిన అధికారాన్ని బీజేపీ కోల్పోయింది.

మోడీ, షా, మంత్రులు, బీజేపీ ప్రముఖులు వగైరా ప్రచారహోరులో పాల్గొన్నప్పటికీ బీజేపీ ఓడిపోయింది.

మరి, ఢిల్లీ మోడీ గెలిచినట్టా... ఓడినట్టా...?

ఓడింది కూడా కాంగ్రెస్ చేతిలో కాదు. ఓ పదేళ్ల కిందటి వరకు రాజకీయంగా తాడూ... బొంగరం లేని కేజ్రీవాల్ చేతిలో.

ఇక,ఎన్నికలు జరిగిన మూడింటిలో హిమాచల్‌ప్రదేశ్ ఒకటి. అక్కడ ఎన్నికలకు ముందు బీజేపీ ప్రభుత్వం ఉంది. ముగ్గురు ముఖ్యమంత్రుల్ని మార్చారు. మోడీ హిమాచల్‌ప్రదేశ్‌లో సుమారు 15 ఎన్నికల సభల్లో ప్రసంగించారు.

అక్కడ ఉన్నది 68 సీట్లు. అంటే... 35 సీట్లు వస్తే, ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. 'మీ అభ్యర్థి ఎవరు అనేది చూడకండి. నన్ను చూసి బీజేపీకి ఓటు వేయండి' అని నరేంద్ర మోడీ ఓటర్లకు పదే పదే విజ్ఞప్తి చేశారు.

అయినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటుకు కావలసిన 35 స్థానాలను బీజేపీ గెలవలేక పోయింది. దాంతో, అక్కడి బీజేపీ... ప్రతిపక్షం అయిపోయింది. అంటే.. ఎన్నికలు జరిగిన మూడింటిలో రెండింటిని బీజేపీ కోల్పోయింది.

మరి, మోడీ గెలిచినట్టా.... ఓడినట్టా....?

ఇక, చివరిగా గుజరాత్. అక్కడ గత పాతికేళ్ల నుంచీ బీజేపీ ప్రభుత్వమే ఉంది. ఇక ముందూ ఉంటుంది. గుజరాత్ సమాజం హిందువులు–మైనారిటీలుగా విడిపోయింది. ఇక, అక్కడ 2002 లో జరిగిన గోద్రా అల్లర్ల మారణహోమం.... గుజరాత్‌లో బీజేపీకి ప్రతి ఎన్నికలోనూ 'శ్రీరామ రక్ష'గా నిలబడుతూనే ఉంటుంది. దీనికితోడు, మహారాష్ట్రలో నెలకొల్పాలని నిర్ణయించిన భారీ పరిశ్రమలను చివరి నిముషంలో గుజరాత్‌కు తరలించారు.

వీటన్నిటి ఫలితంగా అక్కడ అధికారాన్ని బీజేపీ నిలుపుకోగలిగింది. అయినప్పటికీ క్రెడిట్ మాత్రం ప్రధాని మోడీదే. ఆయన ప్రభావం ఫలితంగానే అత్యధిక స్థానాలను బీజేపీ గెలుచుకుంది. వరుసగా ఏడోసారి అధికారం చేపట్టింది. ఇక్కడ గెలిచింది మోడీయే.




అయితే....! 2024లో పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించుకుంటే... బీజేపీకి జాతీయ ప్రత్యామ్నాయం అనేది కనుచూపు మేరలో కనిపించడం లేదు. అందువల్ల, ఒకరి ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా.. మోడీయే తిరిగి అధికారంలోకి వస్తారని చెప్పడానికి జ్యోతిష్యం తెలియాల్సిన పని లేదు.

దక్షిణ భారతదేశం మొత్తం అంతా కలిపి 15, 20 లోక్‌సభ స్థానాలు సైతం లభించకపోతే.... లభించకపోవచ్చు గాక!

కానీ, ఉత్తరభారతదేశం చాలు బీజేపీ కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టడానికి. దక్షిణ భారత దేశంలో బీజేపీ బ్రాండ్ పేరు మీద వచ్చే ఆ కొద్దిపాటి స్థానాలు... ఆ పార్టీకి బోనస్ మాత్రమే.

2024 ఎన్నికల నాటికి కాంగ్రెస్ కోలుకునే వాతావరణం కనిపించడం లేదు. గుజరాత్ ఎన్నికల ఫలితాలతో 'జాతీయ పార్టీ'గా అవతరించిన 'ఆప్' 'మైసూర్ బోండా' వంటిదే. బోండాలో మైసూర్ ఉండదు కదా! 'ఆప్'లో కూడా జాతీయపార్టీ లక్షణం ఉండదు. కేరళలో సిపిఎం, తమిళనాడులో డీఎంకే, ఆంధ్రలో వైసీపీ / టీడీపీ, తెలంగాణలో కేసీఆర్, కర్ణాటకలో కాంగ్రెస్, ఒడిశాలో నవీన్ పట్నాయక్, బెంగాల్‌లో మమతా బెనర్జీ, బీహార్‌లో లాలూ ప్రసాద్‌యాదవ్ పరివారం, యూపీలో అఖిలేష్ యాదవ్, మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే మొదలైన పార్టీలు/నేతలు గణనీయమైన ఫలితాలు సాధించినప్పటికీ జాతీయ స్థాయిలో మోడీని, బీజేపీని సవాలు చేయగల పరిస్థితుల్లో అవి లేవు. ఎందుకంటే... ఏ రెండు పార్టీల మధ్య ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం కనిపించదు.



అందువల్ల ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో మోడీ ఓడారా.... గెలిచారా అనే చర్చతో సంబంధం లేకుండా... 2024 లోకసభ ఎన్నికల్లో కూడా ఆయనదే (బీజేపీ) గెలుపని నిస్సందేహంగా చెప్పవచ్చు.

బీజేపీకి... నరేంద్ర మోడీకి జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయ రాజకీయాల గురించి కాక... ప్రజల బాగోగుల గురించి ఆలోచించే జాతీయ ప్రత్యామ్నాయ నాయకత్వం లేకపోవడం అనేది... నరేంద్ర మోడీ అప్రతిహత రాజకీయ ప్రయాణానికి ప్రధాన సోపానం.

మరో పక్కన... తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావేమో... తానే మోడీకి ప్రత్యామ్నాయం అంటున్నారు. అలా అనడానికి కావలసినంత డబ్బు... దస్కం, దమ్ము, ప్రచార సరంజామా ఆయన కనుసన్నలలో ఉన్నాయి. ఆయన ముఖ్యమంత్రిగా ఉంటున్న ఈ ఎనిమిదేళ్ళల్లో అవన్నీ సమకూరి ఉంటాయి.

ఆయన ధైర్యాన్ని ఎవరైనా మెచ్చుకోవలసిందే. దేశానికి గుండె కాయవంటి ఢిల్లీని పాదాక్రాంతం చేసుకున్న కేజ్రీవాల్ కూడా... మోడీకి తానే ప్రత్యామ్నాయం అనడం లేదు. ప్రధాని పదవిపై వెయ్యి కళ్లేసి ఉంచిన బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బైటపడి మాట్లాడడం లేదు. మరాఠా వృద్ధమార్తాండం... శరద్ పవార్ చప్పుడు చేయడంలేదు. కానీ చంద్రశేఖరరావు మాత్రం బీఆర్ఎస్ అంటూ రంగంలోకి దిగేశారు. 'ఎర్రకోటపై గులాబీ జండా ఎగురవేస్తాం' అంటున్నారు (వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో... మొత్తం 543 లోక్‌సభ స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకున్నప్పటికీ ఢిల్లీ ఎర్రకోటపై స్వాతంత్ర్య దినోత్సవం నాడు భారత జాతీయ పతాకాన్నే ఎగురవేయాలి. అధికార పార్టీ పతాకాన్ని కాదు).

సరే. ఆయన ఆనందం ఆయనది. ఎవరు మాత్రం ఎందుకు కాదనాలి?

మోడీ విషయానికి వస్తే, ఒక్క కేరళ రాష్ట్రాన్ని మినహాయిస్తే... ఆయన నాయకత్వానికి నయానో.. భయానో... కిక్కురు మనకుండా మద్దతు ఇచ్చే పార్టీలు దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ ఉన్నాయి. రాజకీయాలలో పతనమైపోతున్న నైతిక విలువలను అడ్డం పెట్టుకుని వాటి నుంచి నరేంద్ర మోడీ 100% ప్రయోజనం పొందుతారనడంలో... ఆయనకు సీబీఐ, ఐటీ, ఈడీ వంటి శాఖలు దన్నుగా ఉన్నాయి. అందుకే, (ఆయనకు బోరు కొట్టకపోతే) మూడోసారీ ఆయనే ప్రధాన మంత్రి. ఇప్పుడు జరిగిన మూడింటి ఎన్నికల్లో... రెండింటిలో ఓడిపోతేనేం?

వచ్చే ఏడాది జరగవలసిన ఉన్న తెలంగాణ, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, నాగాలాండ్, జమ్మూ & కశ్మీర్, కర్ణాటక, మిజోరాం, మేఘాలయ వంటి రాష్ట్రాల్లో బీజేపీ గెలిస్తేనేం... గెలవకపోతేనేం...? నరేంద్ర మోడీయే మూడోసారి కూడా మన ప్రధానమంత్రి.

**- భోగాది వేంకట రాయుడు**

bhogadirayudu2152@gmail.com

## ఆదర్శప్రాయం..'శ్రీలక్ష్మమ్మ' దేహసమర్పణ



'మరణానంతరం కూడా జీవితం ఉంది. దేహ సమర్పణే అందుకు మార్గం' అనే ఆలోచనను ఆచరణలోకి పెడుతోంది నెల్లూరులోని 'పినాకిని దేహసమర్పకుల సంస్థ'. మృతిచెందిన వారి దేహాలను వారి అనుమతితో, పదుగురికీ ఉపయోగపడే వైద్యశాస్త్ర పరిశోధనలకు సమర్పించే ఈ బృహత్తరమైన కార్యక్రమానికి తోడ్పడుతూ, అందుకు సమ్మతించేవారు వారి కుటుంబసభ్యులు మరణించినప్పుడు, వారి దేహాలను వైద్యకళాశాలలకు సమర్పించి వారి జీవితాలను సార్థకం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధాప్యంలో తన 81వ ఏట, ఈనెల10న కన్నుమూసిన తమ తల్లి శ్రీలక్ష్మమ్మ దేహాన్ని, ఆమె తనయుడు కాకుటూరు వెంకటకృష్ణారెడ్డి 'పినాకిని' దేహసమర్పకుల సంస్థ ద్వారా నారాయణ వైద్యకళాశాలకు అప్పగించారు. దీంతో, ఆ మాతృమూర్తి శ్రీలక్ష్మమ్మ జీవితం ధన్యమైనట్లే. ఆమె దేహాన్ని నారాయణ వైద్యకళాశాలలోని మానవ శరీరనిర్మాణ శాస్త్ర విభాగం ప్రధానాచార్యులైన కసుకుర్తి ఆశాలతకు అప్పగించినట్లు పినాకిని దేహసమర్పకుల సంస్థ ఆర్గనైజర్ తిక్కవరపు సుకుమార్‌రెడ్డి తెలియజేశారు. ఆ వైద్యకళాశాల నిర్వహణాధికారి డాక్టర్ సందేశ్‌రాయంకర్, శాస్త్ర విభాగం సిబ్బంది కొల్లు శ్రీనివాసులు, గుంజి వంశీకృష్ణతో పాటు గంగపట్నం శేఖర్‌రెడ్డి, మచ్చర రాజగోపాలరెడ్డి ఈ దేహసమర్పణకు సహకరించారని పేర్కొన్నారు. శ్రీలక్ష్మమ్మ నెల్లూరు వనంతోపు నివాసి అని, ఈ ప్రాంతం నుంచి గతంలో ముద్దపాటి రాఘవయ్య ఇదేవిధంగా దేహసమర్పణ చేశారని, మొత్తంగా తమ 'పినాకిని' సంస్థ నిర్వహణలో ఇది 31వ దేహసమర్పణ అని ఆయన వివరించారు. ఈ దేహసమర్పణకు సహకరించిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## దాహం.. దాహం

దాహం
జలప్రళయాలు పుక్కిటపట్టినా
జన ప్రవాహానికి దాహం తీరడం లేదు
ఎటు చూసినా పెనుదాహ చింతనమే
చూసే కొద్దీ అవలోకించే కొద్దీ
దాహం అనకొండై దావానలంలా
భూన భోంతరాళాలు విస్తరించిపోతున్నది
మనిషి వామనుడైపోతుంటే
దాహం హిమవన్నగమైపోతున్నది
కండల్నీ, కొండల్నీ, గుళ్ళనీ, గుండెల్నీ
కబళించాలని –
విశ్వమంతటినీ శివునిలా మ్రింగాలని
ఆశ్చర్యకర దాహద్రోణి!
కడలి అంచునుంచి నింగి కడ దాకా
పగటినీ రాత్రినీ నుశిచేసి భోంచేయాలన్న
ప్రళయ కావేరి దాహం
ఈ దాహమ్మొక పద్మవ్యూహం!
స్వప్నాలు కననీయని, కనురెప్పల వలయాల్ని
మూయనియ్యని
మనిషిని కుదిపేసి, మెదడును కవ్వంలా చిలికేసి
వేదనా జడివానల్ని దుప్పటిలా కప్పేసే దాహాభిభత్సం
తుఫాన్లను సైతం మోసుకొచ్చి
శరీర మహానగరంలో ప్రవేశపెట్టే పెనుదాహం
ఇదో కొండచిలువ ఆకలివంటి
కేళీవిలాసమైన దాహం
ప్రపంచంపై ఆధిపత్యం కోసం విద్యుద్ఘాతం
విసరాలన్న దాహం
ఇదో విచిత్ర విలాస రమణీయ రాక్షస క్రీడ
ఎగురవేసే రంగు రంగుల జెండాలది
ఇదే దాహం
నదిలో దూకి సైతం పులిలా లంఘించాలనే
శబ్దాలకు రెక్కలిచ్చిన దాహం
అన్నిటా ఘనీభవించిన అవకాశవాద దాహం
బ్రతుకులోని కొద్ది కాలానికే
ఈ దాహయుద్ధభేరి అగత్యమా?
మూణ్ణాళ్ల జీవితానికి యుగాల
అదృశ్యాల ఆనంద సముద్రం సమర్థనీయమా?
అందుకే నేనో జలపాతమై రాత్రి నక్షత్రాల్ని మోసుకొచ్చి
కొండల విల్లంబులతో, కోనల కరవాలాలతో
దాహం కుత్తుకలు కోయాలని ఉంది
దాహార్తి నరకాసురుణ్ణి
వధించాలని ఉంది!



**చిన్ని నారాయణరావు**

9440202942

# గిరిజనులందరికీ.. మొబైల్ నెట్‌వర్క్ అందుతోందా?



## లోక్‌సభలో ప్రశ్నించిన నెల్లూరు ఎంపీ ఆదాల

దేశంలోని గిరిజనులందరికీ మొబైల్ నెట్‌వర్క్ కవరేజీ అందుతోందా? అని నెల్లూరు ఎంపీ ఆదాల ఈనెల 14న లోక్‌సభలో ప్రశ్నించారు. ఒకవేళ అందకుంటే, తీసుకున్న చర్యలేమిటని కూడా ప్రశ్నించారు. కేంద్ర సమాచార ప్రసార శాఖామంత్రి దేవ్‌సిన్‌చౌహాన్ అందుకు రాతపూర్వకంగా సమాధాన మిస్తూ 2022 మార్చి నాటికి 1,20,613 గిరిజన గ్రామాలు ఉండగా, అందులో 1,00,030 గ్రామాలకు మాత్రమే మొబైల్ నెట్‌వర్క్ కవరేజ్ ఉందని తెలిపారు. ఇంకా 20,583 గ్రామాలకు ఈ సౌకర్యం కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ఇవన్నీ వాణిజ్యపరంగా లాభదాయకం కాని, తక్కువ జనాభా ఉన్న మారుమూల ప్రాంతాలని పేర్కొన్నారు. ప్రభుత్వం, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు దశలవారీగా ఆ గ్రామాలకు కనెక్టివిటీని అందిస్తాయని తెలిపారు. ఇందుకుగాను ఎన్నో పథకాలను అమలుచేస్తున్నామని పేర్కొన్నారు.

## నిరుపేదలకు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారా?

మురికివాడల్లో నివసించే నిరుపేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించే ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ఎంతవరకు అమలైందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 15న గురువారం పార్లమెంట్లో అడిగారు. కేంద్ర పెట్రోలియం సహజవాయువు సహాయ మంత్రి రామేశ్వర్ తెలి దీనికి రాతపూర్వకంగా సమాధానమిస్తూ, ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం 2016లో ప్రారంభమైందని తెలిపారు. 8 కోట్ల మందికి ఎల్పీజీ కనెక్షన్లు అందించాలనే లక్ష్యం 7 నెలల ముందే 2019లో పూర్తయిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన కింద అర్హులైన పేద కుటుంబాలు, ఆవాస్ యోజన కింద అర్బన్ లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్లను పొందవచ్చునని తెలిపారు. 'ఉజ్వల' అమలు రెండోదశ 2021 ఆగస్టులో ప్రారంభమైందని, ఈనెల 1వ తేదీ నాటికి 1.57 కోట్ల గ్యాస్ కనెక్షన్లు అందజేశారని వివరించారు.

### లండన్‌లోని 'బ్రునెల్ విశ్వావిద్యాలయం' నుండి

## మాస్టర్స్ డిగ్రీ అందుకున్న రత్నం మాస్టారి మనుమరాలు


# 'రోషిని కొర్రపాటి'


అమ్మ నాన్నలు వాసంతి - డాక్టర్ కిషోర్‌లతో రోషిని

ఎంతోమంది డాక్టర్లు, ఇంజనీర్లకు విద్యాప్రదాత, వారి బంగారు భవిష్యత్తుకి విధాత రత్నం మాష్టారు. మూడు తరాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో రత్నం అయ్యవారిని తెలియనివారు ఉండరు. రత్నం సారు - పద్మావతి రత్నంల మనుమ రాలు, డాక్టర్ కిషోర్-వాసంతిల కుమార్తె రోషిని కొర్రపాటి లండన్‌లోని 'బ్రునెల్ యూనివర్సిటీ' నుండి మాస్టర్స్ డిగ్రీ అందుకుంది. కార్పొరేట్ సెక్టార్‌లో బిజినెస్ & మేనేజ్‌మెంట్ విభాగంలో మంచి ఉత్తీర్ణత సాధించి మాస్టర్స్ పట్టా అందుకుంది రోషిని. లండన్‌లోని యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 15వతేదీ గురువారం సాయంత్రం జరిగిన కాన్వొకేషన్‌లో రోషినికి ఈ డిగ్రీ అందించారు.

తాతకు తగ్గ మనుమరాలిగా, అమ్మానాన్నల కల నెరవేరుస్తున్న రోషిని, నెల్లూరులో త్వరలో ప్రారంభంకానున్న డాక్టర్ కిషోర్స్ రత్నం జూనియర్ కాలేజీలలో డైరెక్టర్‌గా కూడా ఉంది. రోషినికి 'లాయర్' శుభాకాంక్షలు.

*ఆయన పేరులో మాత్రమే 'పొట్టి'!..'దీక్ష'లో మహా గట్టి. పట్టుబట్టి.. ఉగ్గబట్టి.. ఎన్నిరోజులైనా సరే, అన్నం, నీళ్లు కూడా లేకుండా ఉడుంపట్టు పట్టి.. ఆశయసాధన కోసం పోరాడడంలో ఆయనే జగజ్జెట్టి. ఆయనే.. మన 'అమరజీవి' శ్రీ 'పొట్టి శ్రీరాములు'. తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిల బెట్టిన.. అమృతమూర్తి.. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహా త్యాగమూర్తి.. శ్రీ పొట్టి శ్రీరాములు!.. ఒకప్పట్లో..ఆంధ్రులు 'ఆరంభశూరుల'ంటూ ఎగతాళి చేసే ఆ రోజుల్లో.. తెలుగోడి సత్తా ఏంటో చూపించిన తెలుగు పౌరుషం పేరే.. శ్రీ పొట్టి శ్రీరాములు. వ్యక్తిగత జీవితంలో ఎన్ని కష్టాలున్నా సరే, ఆశయసాధనలో ఎన్ని బాధలున్నా సరే.. ఆయన అన్నిటినీ నవ్వుతూనే భరించారు. చివరికి మృత్యువును కూడా నవ్వుతూనే ఆహ్వానించారు. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఒకటా రెండా.. 58 రోజులు కఠోరదీక్షతో..ఆమరణదీక్ష చేసి..ఆత్మబలిదానం చేసి..తెలుగువారికో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిపెట్టి..ఆంధ్రులు ఆరంభశూరులు కారని నిరూపించి మరీ వెళ్ళిపోయారాయన. అందుకే ఆయన కారణజన్ములు!..అలాంటి మహోన్నత త్యాగ మూర్తి పేరును చిరకాలం గుర్తుంచుకుంటూ నెల్లూరు జిల్లాకు 'శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా'గా నామకరణం చేయడం జిల్లాకే గర్వకారణం.*



*'అమరజీవి' ఆత్మబలిదానానికి ఈ డిశెంబరు 15వ తేదీతో 70 ఏళ్ళు. 70 కాదు కదా మరో 700 ఏళ్ళు గడిచినా తెలుగోళ్లయిన వాళ్ళెవరూ వారిని మరచిపోరు. ఆయన అసమాన ఆమరణదీక్షను ప్రజలెవరూ మరచిపోలేరు. ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శం!..ఆయన జీవితం మార్గదర్శకం!..నిరుపమానమైన త్యాగానికి ఆయనే ఓ ప్రతీక!..తెలుగోడి గుండెనిబ్బరానికి ఆయనే ఓ నిలువెత్తు పతాక!.. ఆయన త్యాగం.. అనితర సాధ్యం!.. అజరామరం!..ఒక్క మాటలో చెప్పాలంటే... ఆయన కారణజన్ములు!..ఆ మహనీయుడిని తలచుకునే జనులంతా ధన్యులు!..*

# 'అమరజీవి' త్యాగం.. అజరామరం

శ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పది మంది ఉంటే ఒక్క సంవత్సరంలో స్వాతంత్ర్యం సాధించవచ్చునంటారు గాంధీజీ. ఈ మాటలు పొట్టిశ్రీరాములులోని కర్తవ్య పరాయణతకు, కార్యదీక్షకు, ధృఢసంకల్పానికి ప్రతీకలై తెలుగువారి కీర్తి పతాకలై ఉజ్వలంగా భాసిస్తాయి. భాషా సంయుక్త రాష్ట్రాలకోసం 58 రోజులు ఏకధాటిగా నిరాహారదీక్ష చేసిన పొట్టిశ్రీరాములు జీవితం, ఆశయాలు ఎంతో గొప్పవి. ఓ ఆదర్శం కోసం, బృహత్తర ఆశయం కోసం ప్రాయోపవేశం చేయ గలిగిన అత్యంత అరుదైన వ్యక్తిత్వం శ్రీరాములుది. పొట్టిశ్రీరాములు ఆంధ్రరాష్ట్రావతరణ భగీరథులు. గాంధేయ సిద్ధాంతానుసరణ మహారథులు, నిరాడంబరతకు ప్రతీక. నిస్వార్ధ ప్రజాసేవకు పతాక. ఆయన దేశాభిమానం అనన్యసామాన్యం, ఆ దీక్షా విధానం అచంచలం.

గాంధేయ సిద్ధాంతమే పరమార్ధంగా భావించిన సంఘ సంస్కర్త శ్రీరాములు. మద్యపాన నిషేధం కోసం, అవినీతికి వ్యతిరేకంగాను పోరాటం చేసిన సేవాదక్షులు. గాంధేయ సిద్ధాంతాన్ని తన బాటగా, బాసటగా భావించి నడిచిన సంస్కరణశీలి. తన ఆత్మార్పణతో ఆనాటి పాలకులకు గుణపాఠం నేర్పిన మహర్షి శ్రీరాములు. తనలోని కర్తవ్య నిర్వహణా యజ్ఞాన్ని, నిబద్ధతను, నిష్టను నిరుపమానంగా లోకానికి చాటిన అనితర సాధ్యమైన వ్యక్తిత్వం శ్రీరాములు గారిది.

## బాల్యం, విద్యాభ్యాసం...

పొట్టి శ్రీరాములు 1901, మార్చి 16న గురవయ్య, మహలక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. ఒకప్పటి నెల్లూరు జిల్లాలోని కనిగిరి సమీపంలో ఉన్న పడమటిపల్లె గ్రామం వారి నివాసం. కరువు కాటకాలు చుట్టుముట్టడంతో శ్రీరాములు తల్లి దండ్రులు ఆ పల్లెను వదలి మద్రాసుకు చేరుకున్నారు. శ్రీరాములు పెద్దగా చదువుకోలేదు. ఆనాటి మద్రాసు నేటి చెన్నై నగరంలో ఫిఫ్త్ ఫారమ్ వరకు మాత్రమే చదివారు. అలాంటి అచేతన స్థితిలో శ్రీరాములు మద్రాసు వదలి బొంబాయి చేరాడు. అక్కడ విక్టోరియా జూబ్లీ టెక్నికల్ యూనివర్శిటీలో చేరి శానిటరీ డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. సెంట్రల్ రైల్వేలో అసిస్టెంట్ ప్లంబర్‌గా ఉద్యోగం చేశారాయన. మేనమామ కూతురు సీతమ్మను పెళ్లి చేసుకొన్నారు. ఆయనకు ఒక కొడుకు పుట్టాడు. పుట్టిన పదిరోజుల్లోనే మరణించడంతో పుట్టెడు దు:ఖం శ్రీరాముల్ని ఆవహించింది. అంతలోనే భార్య మరణం మరో అశనిపాతమైంది. జీవితంపై విరక్తి కలిగింది.

ఒకపక్క తాను ఆరాధించే గాంధీజీ సిద్ధాంతాలపట్ల ఆకర్షితులై చేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాన్ని వదిలేసి, 1938 ప్రాంతంలో సబర్మతీ ఆశ్రమానికి చేరారు శ్రీరాములు. స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా సాగుతున్న రోజులవి. ఆ సమయంలోనే ఆయన గాంధీజీని కలవడం, మహాత్ముని ఆదేశాల మేరకు సబర్మతీ ఆశ్రమంలో సేవ చేయడానికి నిర్ణయించుకోవడం జరిగింది. సర్వోదయ నాయకులు ఆచార్య వినోభాబావే, రామ మనోహర లోహియా, జయప్రకాష్ నారాయణ్ వంటి ఉద్ధండులైన నాయకులతో పరిచయం, స్నేహం కుదిరిన అదృష్టవంతుడు శ్రీరాములు. గాంధీజీ అనుజ్ఞతో పర్యటనలు చేపట్టాడు. ఆ పర్యటనల్లో భాగంగా శ్రీరాములు మన రాష్ట్రానికి వచ్చారు. గాంధీజీ ఆశ్రమం ఉన్న నెల్లూరులో పర్యటించారు. అది 1944 ప్రాంతం. నెల్లూరుకు వచ్చిన పొట్టి శ్రీరాములుకు దేవతా చెంచురామయ్య ఆశ్రయం కల్పించారు.

## దళిత జనోద్ధరణ - సంఘ సంస్కరణ

పొట్టి శ్రీరాములు నెల్లూరులో ఉన్నపుడు హరిజన దేవాలయ ప్రవేశం, హరిజన గిరిజనులతో సహపంక్తి భోజనం వంటి కార్యక్రమాలెన్నో చేశారు. హరిజనుల దేవాలయం ప్రవేశం కోసం ఎన్నో ఉపవాస దీక్షలు చేపట్టారాయన. ఆరోజుల్లో తిప్పరాజువారి సత్రంలో స్వాతంత్ర్య ఉద్యమాలు జరిగేవి. గండవరపు హనుమారెడ్డి, వేమూరు రత్నయ్య, ఇంద్రగంటి సుబ్రహ్మణ్యం, ఓరుగంటి వెంకటసుబ్బయ్య లాంటి దేశభక్తులతో పొట్టి శ్రీరాములు ఉద్యమాల్లో పాల్గొనేవారు. పోలీసులు తిప్పరాజుసత్రాన్ని అష్టదిగ్బంధం చేసేవారు. దొరికిన వారిని దొరికినట్టు లాఠీలతో కొట్టేవారు.

శ్రీరాములు స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్న సందర్భాల్లో తమిళులైన మదరాసీలు తెలుగు వాళ్లను అవమానించడం ఆయన దృష్టికి వచ్చింది. ఆంధ్రులను ఆరంభశూరులని దుర్భాషలాడే వారు. తెలుగువారికి తగిన గుర్తింపులేక మదరాసీలుగానే చెలామణి అయ్యే అవమానకర ధోరణి ప్రబలంగా ఉండేది.

## ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష

దీంతో ఆయన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పరితపించారు. అందుకోసం ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. కఠినదీక్షతో 58రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి అసువులు బాశారు. 1952, డిసెంబరు 15న ఆయన ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆత్మార్పణ జరిగిపోయింది. అతని ఆత్మ శక్తికి నివ్వెరపోయింది ప్రపంచం. ఆ దుర్వార్త విని ఆంధ్రరాష్ట్రం అల్లకల్లోలమైంది. ప్రజలంతా శోకసముద్రంలో మునిగిపోయారు. అమరవీరుని త్యాగఫలంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆయన స్ఫూర్తితో భాషా ప్రయుక్త రాష్ట్రాలకు నాంది ఏర్పడింది.

ఆ మహనీయుని త్యాగశీలతకు గుర్తుగా మే 22, 2008న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం నెల్లూరుజిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేయడం ద్వారా ఆయనకు ఘనమైన నివాళి అర్పించినట్లయ్యింది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com